# తీర్థయాత్ర (టాంజానియా ట్రావెలాగ్)

## - గొల్లపూడి మారుతీరావు



శ్రీ

కౌముది

మీ మునివేళ్ళ సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 3

# తీర్థయాత్ర (టాంజానియా ట్రావెలాగ్



## గొల్లపూడి మారుతీరావు

## 1



ఈ శీర్షిక చూసినప్పుడు తాత పిలకకీ తాటిచెట్టు కొమ్మకీ ముడివేసినట్టు అనిపించవచ్చు. కానీ మానవుడు తన తెలివితేటలతో, అపూర్వమైన మేధాసంపత్తితో, ఐశ్వర్యంతో, రేపుని మరచిపోయి 'నేడు'ని అలంకరించుకుంటున్న నేపథ్యంలో, మారణాయుధాలూ, మత్తుపదార్థాలూ, యుద్ధాలూ, స్వార్థాలూ మానవజీవితానికి అర్థం చెపుతున్న 21వశతాబ్దంలో - ఇంకా ఓ మూల సృష్టికర్త ఊహించిన, ఆశించిన, రూపుదిద్దిన విధంగా జీవనవైవిధ్యం(bio-diversity) పరిఢవిల్లుతోందని చాలా మందికి తెలీదు. ఆ సృష్టికర్త అసలు సిసలైన లీలని దర్శించే ఈ యాత్రని 'తీర్థయాత్ర' అంటున్నాను. ఈ తీర్థయాత్ర మతాలకతీతం. సృష్టికర్తని ఏ మతం వారు వారి కిష్టమయిన పేరుతో పిలుచుకోవచ్చు. కానీ సృష్టికి అలాంటి మారు పేరు లేదు. ఇది ఆ సృష్టికి సంబంధించిన యాత్ర.

✷✷✷

చాలా నెలల క్రితం నాకు ఖర్గపూర్ నుంచీ ఫోన్ వచ్చింది - ప్రవాసాంధ్ర నాటకోత్సవాలకి ముఖ్యఅతిథిగా సత్కారాన్ని పొందాలని. నేనేమో చెన్నైలో ఉన్నాను. న్యాయంగా రాలేనని రకరకాల కారణాలు చెప్పవచ్చు. కానీ నాటక రంగం అనగానే మనస్సులో పక్షపాతం తోసుకొచ్చింది. "నేను రావాలంటే మీకు చాలా ఖర్చవుతుంది. నాటక పరిషత్తుల స్తోమతు నాకు తెలుసు. ఇబ్బంది పడకండి. నన్ను పిలిచినందుకు చాలా కృతజ్ఞుడిని" అన్నాను. అక్కడితో ఆ విషయం ముగుస్తుందనుకున్నాను. మరో వారం రోజులకి మరో ఫోనొచ్చింది. "ఖర్చయినా పరవాలేదు. మీరు కలకత్తా రండి. అక్కడ మేం కలుస్తాం" అన్నారు. ఉపన్యాసాలకీ, సభలకీ ఊళ్ళు తిరిగే సరదా తగ్గిపోయి చాలా ఏళ్ళయింది. కాగా, వాగి ఎవరినీ మార్చలేమనీ, దండలు వేసి మాట్లాడమన్న మాటలు - ఎవరి చెవుల్లోనూ నిలువవని నాకు అనుభవం నేర్పిన పాఠం. మర్యాదగా తప్పుకోవాలనుకుంటూనే ఇరుక్కున్నానని అనుకుంటూ విమానం ఎక్కాను. ముందు రోజు రాత్రే ఖర్గపూర్ నుంచీ కారులో వచ్చి - రాత్రంతా కారులో కునికిపాట్లు పడి, ఉదయమే ఆనందంగా ఎయిర్‌పోర్టులో నా సంచీ అందుకున్నారు తెలుగు మిత్రులు. అమ్మయ్య, వీరు నిజంగా నాటకాభిమానులే అనుకున్నాను - నిద్రచాలని వారి ముఖాలని చూస్తూ.

అందులో ఖర్గపూర్ నాటక పరిషత్ అధ్యక్షులు గంటి రాజగోపాలరావుగారున్నారు. కారు బయలుదేరగానే "దారిలో మా అన్నగారి అమ్మాయి ఇంటికి వెళదాం" అన్నారు. ఇది బొత్తిగా నాకు నచ్చని విషయం. తెలిగ్గా గొళ్ళెం పెట్టుకునే విషయం. మళ్ళీ పలకరింతలూ, కాఫీలూ, టిఫిన్లూ - నేను వద్దనడం, వారు "అయ్యో, ఏదయినా తీసుకోరాదా!" అనడం, నా అలవాట్లని వివరించడం, వారు అర్థం చేసుకోకపోయినా చేసుకొన్నట్టు నటించడం - ఇదంతా పెద్ద రాద్ధాంతం. కొత్తగా కలిసిన వారికి ఇన్ని విషయాలు ఎలా చెప్పి ఒప్పించడం?

కాగా, అప్పుడు కలిసిన వ్యక్తితో అపూర్వమయిన అనుభవాలనీ, అనుభూతులనీ పంచుకోగలననీ, అక్కడ ఓ గొప్ప స్నేహితుడు, హితుడూ, అభిమాని, ఆరాధకుడూ ఉన్నాడని ఊహించలేదు.

తెల్లగా, పొట్టిగా ఉన్న ఒకాయన నన్ను చూడగానే లేచారు. ఇంట్లో అందరికీ 'గొల్లపూడి' అనగానే పెద్ద సంచలనం కలిగిందనుకోను. నేను 'పారుపూడి, మంగిపూడి' అయినా వాళ్ళని ఇబ్బంది పెట్టినట్టు లేదు. ఆనవాయితీగా కాఫీలు అడగడం, ఆత్రుతగా తప్పించుకోడం జరిగాక - ఈయన కెమేరా పట్టుకొచ్చారు. ఊపిరి సలపకుండా ఫొటోలు తీశారు. రేపు ఖర్గపూర్ సభకి వస్తున్నామంటూ మమ్మల్ని లిఫ్ట్ వరకూ సాగనంపారు. ఆయన పేరు గంటి ప్రసాదరావు.

ఈయన సోంపేటలో ఓ సాదా సీదా బడిపంతులు కొడుకు. ఆ రోజుల్లో తండ్రి పంపే 9 రూపాయల ఎనభై అయిదు పైసలతో (మనియార్డరు ఛార్జీ పదిహేను పైసలు పోగా) విజయనగరంలో వారాలు చేసుకు చదువుకున్నారు. క్లాసులో, స్కూల్లో, రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడం తప్ప మరొకటి ఎరగరు. గణిత శాస్త్రంలో తనదయిన ప్రత్యేక విభాగాన్ని పరిశోధించి ఓ గ్రంధాన్ని ప్రచురించారు. ఆ విషయం మీద ఎన్నెన్నో దేశాలలో పరిశోధనలు జరుగుతున్నాయి. ఓ చైనా శాస్త్రజ్ఞుడు ఆయన పట్ల ఆరాధనా భావంతో ఓ గ్రంధాన్ని ఈయనకి అంకితం ఇచ్చారు. ప్రస్తుతం పర్యావరణ కాలుష్యం మీద, భూమి మీద జీవనాన్నికి సహకరించే సహజ శక్తులు (ఇది సరైన అనువాదం కాదు - కనుక ఇంగ్లీషునాశ్రయిస్తే సరిపోతుంది. Life support systems) గురించి యునెస్కో తలపెట్టిన పది సంవత్సరాల ప్రాజెక్టులో వీరు అంతర్జాతీయ సంపాదక మండలి సభ్యులు, ప్రపంచంలోని మేధావులందరినీ ఆహ్వానించి ఈ సంస్థ 17 విజ్ఞాన సర్వస్వాలను సిద్ధం చేస్తోంది. ప్రచురిస్తే - ఇది 200 సంపుటాల గ్రంధమవుతుంది, గణిత శాస్త్రంలో గంటి వారు ప్రపంచ ప్రఖ్యాతులు. ఇంత చెపితే కానీ ముందు కథకి ఆలంబన కుదరదు.

ఖర్గపూర్‌లో నాటకోత్సవం, నాకు సత్కారం, ఆ సభలో క్లుప్తంగా ఆయన ప్రసంగం - ఇవన్నీ యధాలాపంగా సాగిపోయాయి. ప్రసాదరావుగారు అబూదాబీలో యునెస్కో పని చేస్తున్నారు. "అక్కడ చాలామంది తెలుగువరున్నారు. మీరు అబూదాబీ రండి" అన్నారు.

ఇది లాంచనంగా ఎవరయినా అనే మాట. నేనూ లాంచనంగానే తలూపాను. ఆ తర్వాత ఆ విషయం మరిచిపోయాను. కానీ ప్రసాదరావుగారు మరిచిపోలేదు. మరో 3 వారాలకే షార్జా తెలుగు సంస్థ ఆహ్వానం వచ్చింది. మరో మూడు నెలలకి షార్జాలో, దుబాయిలో, అబూదాబీలో ఉన్నాను. అదొక ఉక్కిరి బిక్కిరి. తెలుగు ప్రభంజనం.

ఇక్కడి ప్రతీ తెలుగు కుటుంబం - డబ్బు సంపాదించి - పిల్లల్ని అమెరికాలో చదివించుకోవాలని కృషిచేస్తూంటుంది. పిల్లల అమెరికా చదువులకి తల్లితండ్రుల పెట్టుబడి - ఇక్కడి జీవనం - అతిస్థూలంగా.

ఇదిగో, ఇప్పుడు యునెస్కో అద్భుతమయిన కృషిని గమనించాను. ఈ ప్రాంతంలో ఇలాంటి కృషికి వెన్నెముకగా నిలిచిన అరబ్ - ఆల్ ఖుబాసీ దర్వీష్ గారిని కలిశాను. ఇక్కడి అరబ్బులందరూ కడుపు నిండినవారు. వీరి జీవనంలో అన్నిటా, అంతటా 'చమురు' వాసన కొడుతూంటుంది. న్యూయార్కుని తలదన్నే భవంతులు, జపాన్‌ని వెక్కిరించే టొయోటోలూ, పారిస్ నగర సంస్కారాన్ని చమురుతో ఎడారికి దిగుమతి చేసుకున్న ఘనులు వీరు. ఇదంతా కేవలం గత 30 సంవత్సరాలలో. అంతకు ముందు వీరు ఒంటె పాలు, మాంసం, ఖర్జూరం తింటూ ఎడారుల్లో ఉండేవారు. ఇప్పుడు చమురుతో జీవితాలను సుసంపన్నం చేసుకుని సుఖాలు మరిగినవారు. ఇక్కడ కష్టపడి పనిచేసేవారంతా ఇండియా నుంచో, పాకిస్తాన్ నుంచో, బంగ్లాదేశ్ నుంచో వస్తారు. కానీ డాక్టర్ దర్వీష్ అందుకు పూర్తిగా భిన్నం. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో పరిశోధన చేసి పి.హెచ్.డి. పట్టా పుచ్చుకున్నారు. గొప్ప మేధావి. అంతకుమించి గొప్ప మానవతావాది. నోరు విప్పితే మానవ శ్రేయస్సు గురించి, ఈ తరంలో అభ్యుదయం పేరిట జరిగే దోపిడీ గురించి మాట్లాడతారు. అరబ్బుల ఆత్మవంచనని చీల్చి చెండాడుతారు. వారి మత ఛాందసాన్ని దుయ్యపడతారు. ఎప్పుడు, ఎక్కడ కొత్త ఆలోచన విన్నా 'థాంక్స్" అని అందుకుంటారు. ఈయన ఈ ప్రాంతంలో యునెస్కో కృషికి మూలపురుషుడు, సూత్రధారి.

ఆ మాత్రం ఈ మాత్రం చదువుకున్న ఎవరికయినా ఈ నాడు ప్రపంచంలో జరిగే పర్యావరణ కాలుష్యం, వాతావరణం వేడెక్కడం, త్సునామీలు, క్రటీనాలూ వెన్నులో చలి పుట్టించక మానవు. పారిశ్రామికీకరణ, అధునాతన జీవన సరళి పేరిట రేపటి మానవుడి ఆస్థిని ఈ తరం - ఎంత దుర్మార్గంగా, ఆలోచనా రహితంగా దోపిడీ చేస్తోందో తెలుసుకున్న కొద్దీ భయం, బాధ కలుగుతుంది.

ప్రసాదరావుగారు దుర్వీష్‌కి పితృతుల్యులు. యునెస్కో గురించీ, పురోగామి దేశల గురించీ, తాము చేస్తున్న పరిశోధనల గురించీ 3 రోజులు దుబాయిలో మాట్లాడుకున్నాం ముగ్గురం. నాకు చాలా విషయాలు తెలిశాయి.

మరి ఈ దోపిడీకి దూరంగా సృష్టిలో యధాతథంగా, సహజంగా ఉన్న స్థలం ఏదయినా ఉందా? అన్న ప్రశ్నకు గంటి వారి నుంచీ, దర్వీష్ గారినుంచీ ఒకేసారి సమాధనం వచ్చింది - "ఉంది" అని.

అప్పుడు - అప్పుడే - టాంజానియా అన్న పేరు మాటల్లో కదిలింది. క్రిందటి సంవత్సరం వీరి రెండు కుటుంబాలూ ఆ ప్రాంతాలకు వెళ్ళి వచ్చాయి. గంటివారి మాటలు వింటూంటే - టాంజానియా వెళ్ళి తీరాలన్న ఉత్సాహం, ఆసక్తీ ఇనుమడించాయి.

అమెరికా మెన్‌హాట్టన్‌లో, లండన్ పికడిల్లీలో, పారిస్‌లో, సిడ్నీలో, టోక్యోలో లేనిది టాంజానియాలో ఏముంటుంది? మనిషి విజయాలకు ఓ బులెట్ ట్రైనూ, ఓ కొలంబియా ఉపగ్రహం - ఇవి చిహ్నాలా? ఇవన్నీ పెద్ద ప్రశ్నలు, సమాధానాలకి యునెస్కో పది సంవత్సరాలుగా కృషి చేస్తోంది.

కానీ పదిహేను రోజుల్లో - ఆ ప్రశ్నలకి సమాధానాన్ని మేం సంపాదించగలిగాం. ఎక్కడ? టాంజానియాలో - ఇంకా స్పష్టంగా చెప్పాలంటే టాంజానియా తీర్ధయాత్రలో.

# 2

నేను వెళ్ళడానికి ఇబ్బంది పడలేదు కానీ - మా పెద్దబ్బాయి నేను మా ఆవిడతో కలిసి అరణ్యావాసానికి వెళ్ళి పోతున్నట్టు చికాకు పడ్డాడు. "హాయిగా ఏ అమెరికానో, లండనో, పారిస్సో వెళ్ళక ఈ టాంజానియా ఎందుకు నాన్నా! అక్కడ నల్లవాళ్ళు, పచ్చ జబ్బులు (ఎల్లోఫీవర్), మలేరియా, పేదరికం - ఇవే చూడాలి" అన్నాడు. సంపద ఎక్కడ చూసినా ఒక్కలాగే ఉంటుంది. ఎక్కువ సార్లు చూస్తే బోరుకొడుతుంది. నేను లండన్ పికడిల్లీలో ఎన్నోసార్లు తిరిగి ఉంటాను. మొదటిసారి ఏమోకానీ - రెండోసారి తలెత్తి నియోన్ దీపాలని చూసిన గుర్తులేదు. కాగా, నేలబారు జీవితం ఆకర్షిస్తుంది. ఆలోచించేటట్లు చేస్తుంది. A master piece is monotonus, while life is not. క్రమ శిక్షణతో పాకే చీమలదండుని గంటసేపు కన్నార్పకుండా చూస్తూ కూర్చోవచ్చు. అంత చిన్న జీవరాశిలో ఏ 'అర'ని క్రమశిక్షణకి భగవంతుడు అమర్చాడో, అదే ఆరని మానవునికి ఎందుకు అమర్చలేదో అర్ధంకాదు. (పాముల కోసం చెట్టంత ఎత్తుకి ఎదిగిన చీమలు పుట్టలు - టాంజానియాలో నన్ను ఆకర్షించిన మొదటి దృశ్యాలు.)

టాంజానియా వెళ్ళడానికి ఢిల్లీలో ఉన్న టాంజానియా హైకమీషన్ వీసా ఇవ్వాలి. దానికి ముందు తప్పనిసరయిన తతంగం ఒకటుంది. వెళ్ళేది అటవీ ప్రాంతమూ, ఇంకా ఆటవికులు నివసించే ప్రాంతం కావడం వల్ల ఈ దేశాలకి వెళ్ళేవారు ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రకారం ఎల్లో ఫీవర్‌కి ఇంజెక్షను తీసుకోవాలి. ఆ సర్టిఫికెట్ ఉంటేనే కానీ కొన్ని ఆఫ్రికన్ దేశాలకు వీసా ఇవ్వరు. ఈ దేశాల్లో ఎల్లో ఫీవర్ ఒకనాటి టైఫాయిడ్ వంటి మహమ్మారి. చాలా ప్రమాదకరమయిన రోగం. అంతే కాదు. ప్రయాణానికి వారం ముందుగా మొదలెట్టి - తిరిగి వచ్చాక రెండువారాల పాటు - అంటే ఒక పూర్తికోర్సు - మలేరియా మాత్రలు (వారానికి ఒకటి చొప్పున) తీసుకోవాలి. ఇవన్నీ ముందు జాగ్రత్తలు.

మనకన్న శుభ్రంగా టాంజానియా నగరాల్లో ఉన్న మసాయివారు "మమ్మల్ని ముట్టుకోకండి. మీకు మలేరియా వస్తుంది" అని వెక్కిరిస్తారు. మరొక హెచ్చరిక - పొరపాటున టాంజానియా వీసా దొరికినా - ఈ ఎల్లో ఫీవర్ ఇంజక్షను లేకపోతే మనం భారతీయులమైనా మనల్ని మన దేశంలోకి రానివ్వరు. మనం ఆ జబ్బుని ఇండియాకు దిగుమతి చేస్తామేమోనని భయం. ఈ విషయాన్ని చెన్నైలో నాకు ఇంజెక్షను ఇచ్చిన డాక్టరు మల్లిక హెచ్చరించారు.

టాంజానియా డబ్బు మన దేశంతో పోలిస్తే చాలా చవక. 47 రూపాయలకి ఒక అమెరికన్ డాలరయితే (ఈ వ్యాసం రాసింది 2005లో) - ఒక డాలరుకి 1130 టాంజానియా షిల్లింగులు దొరుకుతాయి. అయితే ఒక్కటే చిక్కు. ప్రతీ వస్తువు మీదా మనవాళ్ళు పదిపైసలు లాభాన్ని వేసుకుంటారు. కానీ ఇక్కడ 100 శాతం - ఇంకా 200 శాతం ఆశిస్తారు. ఉదాహరణకి - బజారులో నాలుగు అరటి పళ్ళు 50 వేల షిల్లంగులు! అంటే రూపాయల్లోకి తర్జుమా చేస్తే దాదాపు 23 రూపాయలు. అయితే ఇలా ఆలోచిస్తే ఏ వస్తువూ మన గొంతు దిగదు. లండన్‌లో కాఫీ ఒక పౌను. అంటే దాదాపు 70 రూపాయలు! అలా ఆలోచిస్తే కాఫీ గొంతు దిగదు. దిగినా పీక పట్టుకుంటుంది.

విదేశాలకి - ముఖ్యంగా - యూరోపు - జర్మనీ, బ్రెజిల్, హాలెండు, ఇటలీ వంటి దేశాలకి వెళ్ళేటప్పుడు - తప్పనిసరిగా గుర్తించుకోవలసిందీ, జాగ్రత్తపడవలసిందీ ఒకటుంది - ఆహారం. అయితే ఇప్పుడిప్పుడు ప్రపంచంలో పెద్ద నగరాలో ఇండియన్ హోటళ్ళు ఉంటున్నాయి. అయినా ఇండియా ఆహారం అంటే ఇంకా చాలా మందికి 'తందూరీ' రొట్టె ముక్కలే! ఎవరికీ ఇడ్లీ, వడ, పొంగల్, మినపట్టు, పెసరట్టు, రవ్వట్టు తెలియదు.

నేను ఎట్టి పరిస్థితులలోనూ రాజీ పడని, పడలేని అంశం - ఆహారం. మా పెద్దబ్బాయి ఇందుకు వ్యతిరేకం. బ్రెజిల్ వెళ్ళి ఇడ్లీ వెదుక్కోడానికి - అంత దూరం వెళ్ళడం ఎందుకు? అంటాడు. అయితే కొత్తరకం ఆహారాన్ని 'మరిగే' వయస్సూ కాదు, మనస్తత్వమూ కాదు నాది. అయితే ప్రియా పచ్చడి సర్వాంతర్యామి. దార్ ఎస్ సలామ్‌లో ఇండియా డిపార్ట్‌మెంటల్ స్టోరులో ఆనంద్ అనే గుజరాతీ యజమాని - 'పచ్చడి' అనగానే ప్రియా పచ్చడి బీరువా దగ్గరకి వెళ్ళాడు. అది మృష్టాన్న భోజనం. అయితే అన్నిచోట్లా ఇలా దొరికే ఆస్కారం లేదు. అందుకని సమృద్ధిగా ఉప్మా, పొంగళ్, బిసిబెళాబాత్ - అర్జంటుగా వేడినీళ్ళలో ముంచితే రెండు నిముషాల్లో తినడానికి తయారయే రెడీమేడ్ ఫలహారాల్ని నా సూట్‌కేస్‌లో దట్టించాను. ఇవికాక శాకంబరీ దేవి ప్రసాదం - ఆంధ్రశాఖ - గోంగూర పచ్చడి, పులిహర మిక్సు పట్టుకున్నాను.

ఇక గంటి ప్రసాదురావుగారి భార్య మీనాక్షిగారు తెలుగు వంటకాల మీద ప్రత్యేకమయిన పుస్తకమే రాశారు. కందిపొడి, పెసరపొడి వంటివి అబూదాబీ నుంచీ వచ్చాయి.

అయ్యా, ఈ సామగ్రితో ఉత్తర ధ్రువంలో పదిరోజులు గడపమన్నా సిద్ధంగా బయలుదేరాం. ఉష్ణప్రాంతం కనుక (ఇంటర్ నెట్లో చూస్తే టాంజానియా ఉష్ణోగ్రత 18 నుంచీ 38 డిగ్రీలు అని తెలిసింది.) తప్పనిసరిగా వరి అన్నం దొరుకుతుంది - అనుకున్నాం. ఒక యోగర్ట్ (పెరుగు) ఉంటే తెలుగు భోజనం తృప్తిగా సాగినట్టే. విదేశాలలో ఆరోగ్యాన్ని పాడుచేసేవి రెండే రెండు - ఒకటి: వాతావరణం. రెండు: ఆహారం. ఈ రెండూ జాగ్రత్త పడితే ఏ యాత్రయినా గట్టెక్కినట్టే.

నేను టాంజానియా యాత్రంతా మీనాక్షిగారి అసిస్టెంటుని. ఇద్దరం భోజనాన్ని నిర్ణయించేవాళ్ళం. ప్రతీ చోటా హోటళ్ళలో సమృద్ధిగా ఉదయం ఫలహారం ఇస్తారు. మధ్యాహ్నం భోజనం అడవిలో అయితే ఏం చెయ్యాలి? మేం చూడబోయే పార్కుల్లో (అడవులకి ఇక్కడి ముద్దు పేర్లు) ఏ వస్తువూ పారెయ్యడానికి వీలులేదు. ప్లాస్టిక్ సంచులూ, సీసాలూ - ఇవన్నీ పర్యావరణానికే కాదు, జంతువులకీ హాని కలిగిస్తాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని - భోజనం అయాక పారేయ వలసిన వాటికి విధిగా ఒక సంచి పెట్టే వాళ్ళం. మన దేశంలో మన వాళ్ళకి రోడ్డే చెత్త కుండీలు. కారు కిటికీల్లోంచీ చెత్తని గిరాటేసి చేతులు తుడుచుకుంటారు. టాంజానియా వంటి చిన్న దేశంలో ఈ

దురలవాటు లేదు. ప్రతీ చిన్నవాడు నేర్చే కొత్త పాఠం ఒకటుంటుంది - ఆ దృష్టి ఉంటే. యాత్రికుల్ని ఈ నిర్లక్ష్యం చూపవద్దని ప్రతీ పార్కు ముందూ వీరు హెచ్చరికలు చేశారు. అయినా అక్కడక్కడ ప్లాస్టిక్కులు దర్శనమిస్తాయి - మానవుడు తన విశృంఖలత్వానికి స్వేచ్ఛ అని ముద్దు పేరు పెట్టుకున్నాడు. అదే ఈ తరం దరిద్రం, ప్రమాద సూచనాను.

అన్నివిధాల సిద్ధమయి చెన్నైలో విమానం ఎక్కాం. ప్రసాదరావు దంపతులు దుబాయ్‌లో మమ్మల్ని కలుస్తారు. నలుగురం దార్ ఎస్ సలామ్(టాంజానియా రాజధాని)కి కలిసి ప్రయాణం చేస్తాం. దుబాయ్ మన దేశానికి గంటన్నర వెనక ఉంది. అందుకని నాలుగున్నర గంటలు ప్రయాణం చేసి గంటన్నర గతంలోకి జొరబడ్డాం. చెన్నై విమానాశ్రయానికే ప్రసాదరావుగారి ఫోన్ అందింది: "అయ్యా, అబూదాబీ నుంచీ దుబాయ్‌కి బయలుదేరాను" అంటూ. అది నూరు మైళ్ళ ప్రయాణం ఆయనకి.


దుబాయ్ విమానాశ్రయంలో

దాదాపు 15 సంవత్సరాల క్రిందట చూసిన దుబాయ్ విమానాశ్రయానికీ ఇప్పటికీ సంబంధం లేదు. అంతర్జాతీయంగా పేరు సంపాదించే లక్ష్యంతో ఏ డిగాల్ ఎయిర్‌పోర్ట్ (పారిస్), షాంగీ (సింగపూర్), జెఎఫ్‌కె (న్యూయార్కు)లకు తీసిపోకుండా నిర్మించారు. ప్రయాణీకులు ఒక మూల నుంచీ మరొక మూలకి వెళ్ళాలంటే మైళ్ళ తరబడి నడవాల్సిందే "మర్హబా" అనే ప్రత్యేకమైన విభాగం విమానాశ్రయంలో ఉంది. మర్హబా అంటే స్వాగతం అని. డబ్బు చెల్లిస్తే ఈ మర్హబా వనితలు చిరునవ్వులు ఒలకబోస్తూ మిమ్మల్ని విమానం దిగినప్పటి నుంచీ, దేశాన్ని ప్రవేశించే ముద్ర (ఇమ్మిగ్రేషన్) వేయించుకుని, సరంజామా తీసుకుని బయట మీకోసం ఎదురు చూసే వాళ్ళకి భద్రంగా అప్పగించి చేతులు కడుక్కుంటారు. అలా విమానాశ్రయంలో మర్హబా లాంజ్ ఉంది - విశ్రాంతి తీసుకోడానికి. మీరు డబ్బు చెల్లించాలే కానీ మీరు కోరుకునే కోతిని మీరు ఎంచుకున్న కొండ మీద నించీ దింపి మీ ముందు ఉంచుతారు.

మేం దుబాయిలోకి వెళ్ళాల్సిన పనిలేదు. అక్కడ టాంజానియా వెళ్ళే విమానం ఎక్కాలి - మధ్యాహ్నం రెండున్నరకి. మర్హబా లాంజ్ ముందే రెండు చేతులూ జాచి ప్రసాదరావుగారు కనిపించారు. అంతే. మా సమస్య తీరిపోయింది. 20 రోజుల తర్వాత ఇదే విమానాశ్రయంలో విమానం ఎక్కే దాకా అన్నీ తెలిసిన వ్యక్తి సారధ్యంలో ఉంటాను.

"ఒకవేళ ఏ కారణం చేతయినా ప్రసాదరావుగారు కలుసుకోలేక పోతే?" అన్నాడు ముందు రోజు రాత్రి - మా రెండో అబ్బాయి - కిట్టప్ప.

"చేతిలో అమెరికన్ ఎక్స్‌ప్రెస్ (ప్లాటినం) కార్డు ఉంది. నోరు ఉంది. పరపతి ఉంది. దుబాయిలో మిత్రులున్నారు. హోటళ్ళున్నాయి. అంతకు మించి ఫోన్లున్నాయి" అన్నాను. తీరా విమానాశ్రయంలోనే కలిశాం. వెంటనే మా అబ్బాయికి ఫోన్ చేసేశాను - "ప్రసాదరావుగారు కలిశారు!" అన్నది ఇతివృత్తం - "సీతని చూశాను" అని హనుమంతుడు చెప్పినట్టు. ఆ తర్వాత ఆనందోత్సాహాలతో మర్హబాలోనే భోజనం మర్హబా బగ్గీలో విమానం గేటు దాకా ప్రయాణం. టాంజానియా విమానం ఎక్కాం - అనుకున్న యాత్ర ఇప్పుడు సాధికారికంగా ప్రారంభమయింది.

✷✷✷

# 3

దుబాయ్ నుంచీ టాంజానియా దాదాపు ఆరుగంటల ప్రయాణం. టాంజానియా అంటే భూమధ్యరేఖ దాటి సుమారు పది డిగ్రీల అక్షాంశం చేరినట్టు. ఆ రేఖకి ఉత్తరంగా అంతే దూరంలో ఆంధ్ర ప్రాంతం ఉంది. అంటే మనకీ, టాంజానియాకి వేసవి, చలి కాలాలు తారుమారు. మన కాలమానానికి రెండున్నర గంటల వెనక ఉంది టాంజానియా. టాంజానియా రాజధాని దార్ ఎస్ సలాం.

రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో టాంజానియాలో విమానం దిగింది. దిగగానే మొదట అనిపించిన విషయం - అంతర్జాతీయ విమానాశ్రయానికి ఉండాల్సిన ఏ హంగులూ ఇక్కడ కనిపించక పోవడం. ఏ జైపూర్, జోధ్‌పూర్ విమానాశ్రయాన్నో గుర్తుచేస్తుంది ఈ విమానాశ్రయం. అయితే దేశం పేదది అన్న విషయం మనం మరిచిపోకూడదు.

ఇంకా ఇమ్మిగ్రేషన్ (అంటే దేశంలో ప్రవేశించే రేఖ) దాటకుండానే ప్రసాదరావుగారు నిర్దేశించిన ట్రావెల్ ఏజెంట్ - లోగడ ఆయనతో పరిచయం వున్న వ్యక్తి - "ప్రోఫ్" అంటూ లోపలికి వచ్చేశాడు. ప్రొఫెసర్ గంటి ప్రసాదరావుగారిని "ప్రోఫ్" అని సంభోదిస్తాడు. కెన్నడీ అతని పేరు. పూర్తి పేరు కెన్నడీ మధెమూ. చివరిది ఆఫ్రికన్ పేరు. క్రితం సారి వచ్చినప్పుడు ప్రసాదరావుగారినీ, దర్వీష్‌నీ అంటిపెట్టుకువున్న వ్యక్తి కెన్నడీ, స్థలాలన్నీ తిప్పిచూపించాడు. ఆ పరిచయంతో, అతని పట్ల ఆదరంతో దర్వీష్ ధన సహాయం చేశారు. ఆ విధంగా దార్ ఎస్ సలామ్ విమానాశ్రయంలోనే "సఫారీ ప్లానర్స్" అనే పేరుతో ట్రావెల్ సంస్థని ప్రారంభించుకున్నాడు. ఆ కృతజ్ఞత, ప్రసాదరావుగారంటే గౌరవం - ప్రతీ పనిలోనూ ఉట్టిపడుతూంటుంది. మరో అరగంటకి సామాన్లతో బయట పడ్డాం. కెన్నడీ స్వయంగా నడిపే వాన్‌లో నగరంలో ప్రయాణం ప్రారంభించాం.

టాంజానియాలో అన్ని కార్లూ, వాన్లూ అరబ్ దేశాల నుంచీ దిగుమతి అవుతాయి - ఒకటి రెండు చేతులు మారాక, బళ్ళలో పూర్వపు హోదా, ప్రస్తుతపు ముసిలితనం కనిపిస్తూంటుంది. నేనక్కడ ఉన్న పదిహేను రోజుల్లోనూ కొత్తగా కనిపించే కారే తప్ప, కొత్త కారుని చూసిన గుర్తులేదు. అయితే మెర్సిడెస్‌లూ, టొయోటోలూ, బి.యం.డబ్ల్యూలు - అన్నీ కనిపిస్తాయి. కానీ అవన్నీ ఇంగువ కట్టిన గుడ్డలు అవసరం తీరుస్తాయి - హోదాని కలిగించకపోయినా. ఆ పదిహేను రోజుల్లోనూ ఏ వాన్‌లోనూ, కారులోనూ ఏసీ పనిచేసిన జ్ఞాపకం లేదు.

ఈ పదిహేను రోజుల్లో కనిపించిన, నాకు అనిపించిన విషయం - ఇక్కడి మనుషులు చాలా సౌమ్యులు. నల్లవారి గురించి - ముఖ్యంగా దక్షిణాఫ్రికాలో నల్లవారి గురించి - వారి దౌష్ట్యం, దుర్మార్గం, ఎదిరింపు, నేర ప్రవృత్తి గురించి భయపడే విధంగా చెప్పాడు మా అబ్బాయి.

శాంతి దూత బాపూజీని రైల్లోంచి క్రిందకి తోసిన మారిస్ పీటర్స్ బర్గ్ స్టేషన్‌కి కారులో వెళ్ళాడు మా అబ్బాయి. కారు దిగి స్టేషన్‌లోకి వెళ్ళాలని అతని కోరిక. తీసుకు వచ్చిన నల్ల డ్రైవరు చెప్పాడట - "బాబూ! కారు ఇంజన్ నడుపుతూ, ఏక్సిలరేటర్ మీద కాలు ఉంచి కూర్చుంటాను. నేను దిగను. ఏదయినా గొడవ జరిగితే కారులో దూకు. దూసుకుపోతాను. ఆ తర్వాత నీ అదృష్టం" అన్నాడట!

ఈ దృక్పథంతో ఉన్న నాకు టాంజానియాలో మాట తూలిన, దుర్మార్గానికి తలపడిన, అసలు ఆ ఆలోచనయినా వున్నట్టనిపించిన ఒక్కడు - ఒక్క వ్యక్తి కనిపించలేదు. కొద్ది కాలం కిందటే స్వేచ్ఛావాయువుల్ని పీల్చి, పరధాన్యం నుంచి విముక్తి పొంది - తమ జీవనాన్ని సాగించడానికి వనరులు కూడదీసుకుంటున్న వ్యవస్థ ఇది. తరతరాలుగా నష్టపోయిన జాతి, కష్టాలు పాలయిన జాతి. "జంబో" అంటే వారి భాషలో "హల్లో" అని. పక్కన నుంచీ పోతున్న ముక్కూ మొహం తెలీని మనిషి కూడా "జంబో" అంటాడు. మనం అంటే ముఖం చాటంత చేసుకుని ఆనందిస్తాడు.

ఇక పేదరికం, నేల బారు జీవితం, గతుకుల రోడ్డు, అతుకుల జీవితాలూ, చిరిగిన దుస్తులూ - అన్నీ, అంతటా మన దేశంలో వెనుక పడిన ప్రాంతాలని గుర్తు చేస్తున్నట్టుంటుంది. రాత్రి వాన్ నడుస్తూంటే - రోడ్డు ఎత్తుపల్లాలు, ఇళ్ళూ, దుకాణాలూ, వ్యక్తులూ - ఏ అమలాపురమో, అదిలాబాదో చూస్తున్నట్టనిపించింది.

"కారు ఎంతకీ గమ్యం చేరదేం?" అని శరీరం ఉదయంనుంచీ పడిన అలసటతో తిరుగుబాటు చేయడం ప్రారంభించింది.

రోడ్డు మీద దుమ్ము, మనుషుల కలకలం, అక్కడక్కడ కనిపించే రద్దీ, అస్తవ్యస్తంగా నడిచే బళ్ళూ - అమ్మయ్య, మనదేశంలాంటి దేశమే మరొకటి ఉన్నదని ధైర్యం వచ్చింది. నిజానికి పారిస్‌లూ, న్యూయార్కులూ నాలో న్యూనతా భావాన్ని రెచ్చగొడుతున్నట్టనిపిస్తుంది. ఈ దేశానికి మా గవర్నరు పేటకీ, రంగనాథన్ స్ట్రీట్‌కీ పోలికలున్నాయి. టింబక్టూలో తెలుగు పలకరింత లాంటిది టాంజానియాలో నన్ను కితకితలు పెట్టిన అవ్యవస్థ - లేదా ఆ వ్యవస్థ!

ఉన్నట్టుండి వాన్ నగరాన్ని వదిలేసింది. రద్దీ తగ్గింది. అంతలో అందమయిన రోడ్డు, చల్లటి సముద్రపు గాలి - హఠాత్తుగా సముద్రం కనిపించింది - ప్రాణం సేద తీరుతుండగానే అందమయిన బీచ్ రిసార్టులోకి వాన్ ప్రవేశించింది. "వైట్ శాండ్స్" హోటల్ పేరు.

వచ్చినప్పటి నుంచీ నా మనస్సులో ఓ ప్రశ్న పీకుతోంది. టాంజానియాలో రకరకాల పట్టణాల పేర్లు కనిపిస్తున్నాయి - మికూమీ, కిల్‌వా, మన్యారా - ఇలాగ మరి దార్ ఎస్ సలామ్ అనే అరబ్ పేరు ఎలా వచ్చింది. ఆ ప్రశ్నకి సమాధానం ముందు ఒకానొక స్థలం.

అయితే దార్ ఎస్ సలామ్ అంటే ఏమిటి? దార్ అంటే నిదానం, ప్రదేశం, నివాస స్థలం. సలామ్ అంటే శాంతి. అంటే ఈ రాజధాని పేరు శాంతినివాసం. వెంటనే మరొక ప్రశ్న ప్రసాదరావుగారిని అడిగాను. అరబ్బులు, ముస్లింలు తరచుగా వాడే మాట "సలాం"కదా అని. ఆయన నవ్వి "అవును. సలాం అంటే శాంతి అని అర్థం" అన్నారు. ఇద్దరు అపరిచితులు కలిసినా 'సలామాలేకుం' అంటారు. "నీతో శాంతిని కోరుకుని వచ్చాను" అని దానర్థం. "అలేకుం సలాం" అని సమాధానం. "నేను కోరేదీ శాంతే" అని. ఎంత అద్భుతమయిన పలకరింత! ప్రతీ మతం ఎంతో ఉన్నతమయిన లక్ష్యాలనూ, ఆదర్శాలనూ సంప్రదాయాలతో ముడి పెట్టింది. నోరు విప్పితే శాంతిని కోరుకునే మతం, జాతి - ఇవాళ హింసాకాండకి, మారణహోమానికీ, ఆత్మాహుతి దళాలకీ ప్రతీకలుగా చాలా దేశాలు భావించే దశకి రావడం దురదృష్టం.

ఆదర్శంలో ఏం లోపం లేదు. అవగాహనలో, అన్వయంలోనే ఎక్కడో పొరపాటు జరుగుతోంది. పొరపాటు కాదు - అనర్థం.

టాంజానియా చిన్న దేశం. కాలిఫోర్నియాకి రెండింతలు. 3861 కిలో మీటర్ల విస్తీర్ణం. ఈ రిపబ్లిక్ రెండు దేశాల సమ్మేళనం. జాంజిబార్ 1963 లో పరదాస్యం నుంచీ విముక్తి పొందింది. టాంగనీకా 1964లో, విడిగా మ్రగ్గిపోయిన రెండు దేశాలు - ఏకమవాలని నిర్ణయించుకున్నాయి. ఫలితం టాంజానియా రిపబ్లిక్.

మనదేశంలో రాష్ట్రాలనీ, కులాలనీ, మతాలనీ, భాషల్నీ - అన్నిటినీ ప్రాంతీయ దురభిమానంతో విడదీయాలని కంకణం కట్టుకున్న, పదవుల్లో నాయకులు ఉద్యమాలు నడుపుతున్న నేపథ్యంలో ఈ కలయిక అపూర్వంగా కనిపించింది. 36 ఏళ్ళ పీడకల వీరిని కలిపి బ్రతికేటట్టు చేసింది. 58 సంవత్సరాల స్వాతంత్ర్యం మనల్ని మళ్ళీ విడదీస్తోంది!

ఎంత విపర్యయం! ఎంత దురదృష్టం!

చదువులో, సంపదలో, వైభవంలో, వనర్లలో, చింతనలో అన్నిటా ముందడుగు వేస్తున్న మన దేశం, నాయకులూ - వీరి దగ్గర్నుంచీ నేచుకోవాల్సింది కనీసం ఒక్కటయినా వున్నదని నా కనిపించింది!

# 4



ఉదయమే "వైట్ శాండ్స్"లో కళ్ళిప్పితే - సముద్రం మీద ఉదయిస్తున్న సూర్యుడు పలకరించాడు. కనుచూపు మేర నీలపు సముద్రపు తెర. మా కాటేజీకి సముద్రానికీ మధ్య విశాలంగా పరుచుకొన్న పచ్చిక - మధ్య కొబ్బరి చెట్లు. "జంబో" అన్న మాటని అప్పటికే అలవాటు చేసేశారు ప్రసాదరావుగారు. కొబ్బరి చెట్ల మధ్య నడుస్తున్న సెక్యూరిటీ - ఒక నల్లమ్మాయిని పలకరించాను. జంబో అనగానే ఆమె ముఖం వికసించింది. ఈ సముద్రం పేరేమిటన్నాను. ప్రశ్న విని నమ్మలేనట్టు షాక్ అయింది - ఈ మాత్రం తెలీదా అన్నట్టు. "ఇండియనోషన్" అంది. ఆ సమాధానంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను.

ఇన్ని వేల మైళ్ళు వచ్చినా నన్నూ, నా దేశాన్నీ కలుపుతోంది ఈ సముద్రం. అంటార్కిటానుంచీ గోండ్వానా పీఠభూమి విడిపోయి - కొన్ని కోట్ల సంవత్సరాలలో వేర్వేరు ఖండాలయిందని శాస్త్రజ్ఞులు నిరూపించారు. (భూమికి సంబంధించిన కాలమానంలో ఈ సంవత్సరాలు ఒక లెక్క కాదు) ఆ లెక్కన - ఆఫ్రికా, ఇండియా ఒకప్పుడు కలిసి వున్నాయి. ఒకటి 'ఆఫ్రికా ఖండ'మయింది. మరొకటి తేలుతూ వచ్చి ఆసియా ఖండానికి అతుక్కొంది. ఒకప్పుడు శ్రీలంక కూడా భారత దేశాన్ని అతుక్కున్న చిన్న ముక్క.

ఎన్ని వేల సంవత్సరాల కిందట - ఎవరు బారసాల చేశారో - ఈ సముద్రాన్ని హిందూ మహా సముద్రం అన్నారు. బుకాయించి, ఊరించి, అతి తక్కువ వ్యవధిలో పదవులెక్కిన నాయకులు ఊర్లు, పట్టణాలు, విమానాశ్రయాలు, రాష్ట్రాల పేర్లను తమకి తోచినట్టు మార్చేస్తున్నారు. కానీ ఈ సముద్రం ఇన్ని శతాబ్దాలు గడిచినా నైరేరే సముద్రం, మారిషస్ సముద్రం, మండేలా సముద్రం కాలేదు - ఇంకా హిందూ మహా సముద్రంగానే ఉంది.

తిరిగి వెళ్ళేటప్పుడు నల్లమ్మాయి నా కాటేజీ ముందు ఆగింది. "మీదే దేశం?" అనడిగింది. ఇక్కడి వారికి ఇండియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్, సీషెల్స్ దేశీయులు ఒక్కలాగే కనిపిస్తారు. గర్వంగా సముద్రాన్ని చూపిస్తూ "హిందూ దేశం" అన్నాను - ఆ సముద్రాన్ని హిందూ మహా సముద్రం అంటారని వివరిస్తూ.

టాంజానియా చుట్టూ చిన్న చిన్న దేశాలున్నాయి - బురుండీ, కాంగో, కీన్యా, ములావీ, మొజాంబిక్, రువాండా, ఉగాండా, జాంబియా. ఈ దేశంలో ఎక్కడ చూసినా రోడ్డుకి రెండు పక్కలా విరగ బూసిన మామిడి చెట్లు కనిపిస్తాయి. ఇంకా జీడి, మునగ, పనస - చూస్తూంటే మన దేశంలోనే మరో ప్రాంతానికి వచ్చినట్టనిపిస్తుంది. ఉన్న కాసిని ఊళ్ళు పోనూ దట్టమయిన అడవులు. చెట్లని కాల్చి, బొగ్గు చేసి బస్తాల్లోకి ఎత్తి రోడ్ల మీద పేరుస్తారు. ప్రయాణం చేస్తూంటే దారి పొడుగునా తాజాగా కోసిన టొమాటో, ఉల్లిపాయ ప్లాస్టిక్ బుట్టల్లో పెట్టి అమ్ముతారు - తూర్పుగోదావరి ప్రయాణం జ్ఞాపకం వస్తుంది నాకు. ఇక నారింజలయితే గుట్టలు గుట్టలు. ఊళ్ళల్లో బట్టలు - లాగూలు, చొక్కాలు, ఫర్నిచరు, బుట్టలు - అన్నీ చెట్ల కింద పేర్చి అమ్ముతారు. బహుశా దుకాణాలు తెరవడం వీరి స్థోమతుకి



మించిన పని కావచ్చు. అరటి తోటలు అపారం. మన దేశంలో కనిపించే చక్కెర కేళీ అరటి ఇక్కడ సామాన్యం. ఊరు దాటితే ఎకరాలకి ఎకరాలు కిత్తలి పెంచుతారు. కిత్తలి నారతో అందమయిన బుట్టలు, సజ్జలు, చాపలు - అన్నీ చాలా అందంగా చేస్తారు. అయితే ఓ బుట్ట ఖరీదు - 8 వేల షిల్లింగులు! - అంటే 8 అమెరికన్ డాలర్లు!

ఈ దేశంలో 120 పైగా ఆటవిక జాతులున్నాయి. ఎక్కువ మంది బంటూ జాతికి చెందిన వారు. అందరూ సామన్యంగా మాట్లాడే భాష స్వాహిలి. దీనికి మరో పేరు కిస్వాహిలి లేక 'కి'ని ఉచ్చరించకుండానే పలుకుతారేమో. స్వాహిలికి లిపి లేదు. ఇంగ్లీషు అక్షరాలతోనే రాసుకుంటారు. మరేవయినా భాషాంతరాలు, లేదా చిన్న చిన్న తెగల భాషలున్నాయోమో తెలీదు.

ఈ పదిహేను రోజుల్లో - తరచుగా దొర్లేకొన్ని పదాలు నోటికి లొంగాయి. షాపుల్లో, హోటళ్ళలో తరచు కనిపించే మాట ఒకటుంది - 'కరీబు'. అంటే స్వాగతం అని. కారు ఆగగానే మన రూటు బస్సుల చుట్టూ మూగినట్టే - పళ్ళు, చిన్న చిన్న చేతిపనుల వస్తువులూ పట్టుకుని నల్ల పిల్లలు మూగుతారు. మన దేశంలో లాగే వస్తువులు కొనమని బతిమాలతారు. వారి వ్యాపారం లాభాలకి కాదు - ఆకలి తీరడానికి, ఇక్కడా అంతే. పలకరిస్తే పట్టుకుని వేలాడతారు. వాళ్ళని వదిలించుకోడం ఎలా? థాంక్స్ అనాలంటే "అసాంతే శానా". 'శానా' అనే మాట ఉత్తరాంధ్రాలో యాస మాట. 'శానా బాగున్నాను బాబూ!'అంటే చాలా బాగున్నాను అని అర్థం. ఎక్కడి సర్కారు 'శానా' ఎక్కడి తూర్పు ఆఫ్రికా 'శానా'!

ఎక్కడ చూసినా కనిపించే దుకాణాలు - దుకాలా దవా. అవును, దుకా అంటే 'దుకాణం', దవా అంటే 'మందు'. ఈ మాటలు బహుశా అరబ్బుల నుంచీ వచ్చిన వారసత్వమయి ఉంటుంది. మందుల దుకాణాన్ని భారత దేశం నుంచీ వచ్చినా ఇట్టే గుర్తుపట్టొచ్చు.

ప్రతీ భాషకీ ఏదో ప్రత్యేకమయిన సౌందర్యం, సొగసు వుంటుంది. తెలుగులో అచ్చులు అందంగా దొర్లుతాయి. ఇక్కడి పేర్లు ఓష్ట్యాలతో ప్రారంభవుతాయి. ఇంగ్లీషులో రాస్తే మొదట M కాని N కానీ ఉంటుంది. MBUTU అన్న పేరుని ఎమ్‌బూటూ అని పలకరు. 'ఉం'బూటూ - ఆ ఎత్తుగడలో పలికే స్వరాక్షరం 'ఉం' లేదా 'ఎం'. వీటిని తెలుగులో ఓష్ట్యాలంటాం. అలాగే మన భాషలో రెండేసి పదాలు కలిసిన మాటలున్నాయి - ముద్దుముద్దుగా, మెల్లమెల్లగా, వెళ్ళి వెళ్ళి, చూసి చూసి - నేనిక్కడ క్రియల్ని ఉదహరించాను. కానీ వీరి భాషలో నామవాచకాలు ఎక్కువ. బహుశా అది ఆ భాష సంతరించుకున్న సౌందర్యమేమో. సంగ సంగ, టింగ టింగ, డిక్‌డిక్, గొరొంగోరో, పోలెపోలె, దాలాదాలా - ఇలాగ.

ఒక స్థలాన్ని, ఒక భాషాని, ఒకదేశాన్ని, వారి జీవన సరళిని, వారి జీవన వైధ్యాన్ని అర్థంచేసుకోవాలంటే ఇలాంటి చిన్న ప్రయాణం చాలదు. ఈ యాత్ర ఓ కొత్త ప్రాంతాన్ని స్థాళీపులాకన్యాయంగా పలకరించడం.

మొదటి రోజునే "సమస్త మానవాళి సిగ్గుతో తలవంచుకునే స్థలానికి తీసుకు వెళతాను" అన్నారు ప్రసాదురావుగారు. కెన్నడీ వాన్ తీసుకొచ్చాడు. దార్ ఎస్ సలామ్‌కి 60 కిలోమీటర్ల దూరంలో 'బగమోయో' అనే రేవు ఉంది. అక్కడికి వెళ్ళాం.



దాదాపు 300 సంవత్సరాల క్రిందట ఇక్కడ ఓ దారుణమయిన వ్యాపారం జరిగేది - అది బానిసల సంత. ఇప్పుడే వెనకబడి, పేదరికంలో ఉన్న టాంజానియా వంటి దేశం 300 సంవత్సరాల క్రిందట ఎలా ఉండేదో ఊహించవచ్చు. ఊళ్ళనుంచీ కుక్కల్నీ, గొర్రెల్నీ ఏరినట్టు నల్లవారిని ఏరి, బంధించి తీసుకు వచ్చి, గొలుసులతో కట్టి వేర్వేరు దేశాలకి రవాణా చేసేవారు. రేవు ఒడ్డున ఈ నల్లవారిని వెల కట్టడానికి గొలుసులతో కట్టివేర్వేరు దేశాలకి రవాణా చేసేవారు. రేవు ఒడ్డున ఈ నల్లవారిని వెల కట్టడానికి గొలుసులతో కట్టి వుంచే ఇనుపరాటలు ఇప్పటికి వున్నాయి. (ఫోటోలో చూడవచ్చు) వారికి చదువురాదు. ఊహ అంతగా తెలీదు. ఏం జరుగుతోందో తెలీదు. కానీ కొనుక్కునే వారికి తెలుసు. ప్రతి బానిస మెడకి ధర కట్టిన పటకా ఉండేది. అమ్మే వర్తకులు - నల్లవారిని గొర్రెల్లాగ, మేకల్లాగ సరుకుని పరిశీలించుకునేవారు. అంటే ఏం చేసేవారు? సూదులతో పొడిచేవారు. కర్రతో కొట్టేవారు. బాధతో 'అమ్మా' అనేవాడి ధర తక్కువ. బాధని తట్టుకు నిలబడేవాడి ధర ఎక్కువ. బాధ పడితే కుళ్ళిన సరుకులాగ చంపుతారేమోనని బాధని కూడా ఉగ్గపట్టుకుని భరించేవారట. ఎంపిక చేసిన నల్లవారిని ఓడల్లోకి ఎక్కించేవారు. పెద్ద సంత జాంజిబార్, కిల్వా కిస్సివానీలలో. విదేశీయుల్ని ఆకర్షించాలంటే "చూడండి బాబూ! ఈ జంతువు కొట్టినా ఏడవదు. గిచ్చినా బాధపడదు" అని హింసించేవారు. ఎవరు? సాటి దుబాసీలు. కొన్నవారిని తమ దేశం వెళ్ళే ఓడల్లోకి ఎక్కించుకునేవారు పది మంది ఉండాల్సిన స్థలంలో 40 మందిని కుక్కేవారు. ఊపిరాడక, జబ్బు చేసి, తిండి లేక, ఎవరికి చెప్పుకోవాలో తెలీక ఎవరేనా చచ్చిపోతే వాళ్ళని సముద్రంలో పారేసేవారు. వైద్యం చేయించే కన్నా కొత్త బానిసని కొనుక్కోడం చవక! బతికి బట్టకట్టిన అదృష్టవంతులు అమెరికా, ఇంగ్లండు, ఫ్రాన్స్, బ్రెజిల్ వంటి దేశాలకు చేరేవారు. ప్రాణం ఉండడం అదృష్టమే గానీ అక్కడా వారి జీవితం పూల పల్లకీ కాదు. తరాల బానిసత్వానికి అది ప్రారంభం. డబ్బిచ్చి కొనుక్కున్న యజమానుల చేతుల్లో హింసలూ, ఆడవారయితే మానభంగాలూ, హత్యలూ - ఒకటేమిటి? అప్పుడప్పుడు వీరిని చూసి జాలిపడిన ఏ పుణ్యాత్ముడో ఏ నల్లవాడికో డబ్బు చెల్లించి స్వేచ్ఛని సంపాదించిన వారిమీద మధ్యవర్తుల కన్ను ఉండేది. మళ్ళీ బంధించి తెచ్చేవారు. మళ్ళీ పాత కథే!

ఏరోజు కా రోజు చల్లని నల్లవారిని రాత్రి ఉంచడానికి రేవులోనే బందిఖానాలవంటి ఏర్పాట్లున్నాయి.. వీటిని వసతి గృహాలనరు. బానిసల గిడ్డంగులంటారు (Ware house)అక్కడ నిలబడినప్పుడు వేదనతో, కోపంతో, ఒకరమయిన జుగుప్సతో, దైన్యతతో శరీరం కంపించింది. మనస్సు కకావికలం అయింది. ఇక్కడినుంచీ జాంజిబార్ "సెన్సర్" వంటిది. 90 ఏళ్ళ ముసలివాడు కొత్తగా కనిపించే మమ్మల్ని చూసి ఆగిపోయాడు. అతని కళ్ళలో అమాయకత్వం, భయం , అతి ప్రాథమికమయిన భీతి - 300 సంవత్సరాల వారసత్వం లాగా కనిపించింది. ఇప్పటికీ ఆ కళ్ళని, అతని చూపునీ మరచిపోలేను. ఒక పాల్‌ముని, ఒక లారెన్స్ ఆలీవియర్, ఒక పృథ్వీరాజ్ కపూర్ ప్రయత్నించినా సాధించలేని ఒక జాతి పీడనకి వారసత్వం ఆ చూపు.

రెండో దశలో వీరి కథ ఇంకా విచిత్రం. క్రమంగా తెల్లవారిని చూసి నల్లవారు భయపడి పారిపోయేవారట అరణ్యాలలోకి. తర్వాత - సరకు (బానిసల) మీద మోజు పెరిగి, సుఖాలకు మరిగిన తెల్లజాతి - నల్లవారిని లొంగదీయటానికి మతాన్ని కూడా వినియోగించారు. (మరి ఇవాళ మతం రాజకీయాల్లో, అంతర్జాతీయంగా మారణ హోమాలకీ వినియోగ పడుతోందంటే మనకి బలమయిన వారసత్వం ఉన్నట్టే లెక్క!) ఇక్కడికి ఒక మత గురువుని దిగుమతి చేశారు. ఒక చర్చిని నిర్మించారు. అలనాటి పాలకుల నుంచీ, మొన్నటి మొగలాయీ పాలకుల వరకు మతం మానవుడి 'బలహీనత' అని గ్రహించారు! ఆ మత గురువు ప్రార్థనలు చేశాడు. అటవికమయిన పేర్లతో బతికే వీళ్ళకి కొత్త పేర్లు పెట్టాడు. ఇదిగో, ఇప్పుడే - కెన్నడీలు, హోసెఫ్లూ, బెనిడిక్ట్లూ దిగుమతి అయారు. వీరికి దేవుడిని ఎరగా చూపారు. చదువుకున్న ఈనాటి వారే మతం పేరిట మనుషుల్ని చంపే ప్రాథమికి ప్రవృత్తితో ఉంటే, ఆనాటి అటవికుల మాట చెప్పాలా? మత గురువు ఉవాచ: "దేవుడేమన్నాడూ? మిమ్మల్ని తెల్లవారికి సేవలు చెయ్యడానికి పుట్టించాడు!!" కాస్త ఆలోచించగలిగిన నల్లవారు - ఆ ఆలోచనని అర్థం చేసుకునే వరకే తమ తెలివిని ఉపయోగించారు. దేవుని మాటలు నమ్మి తెల్లవారికి సేవలు చెయ్యడానికి వీరు ఓడలు ఎక్కారు. దేవుని పేరిట విమానాలు కూల్చే విజ్ఞులు కొల్లలుగా ఉన్న నేటి తరానికి ఈ అమాయకుల్ని అర్థం చేసుకోవడం కష్టం కాదు. అలా ఎక్కడానికి ఇష్టపడని వారిని డబ్బు, జులుం ఎక్కించింది. ఇప్పటికీ ఆ చర్చి ఇక్కడ ఉంది! ఇప్పుడిక్కడ మురికి పట్టిన సముద్రజలాలు, కొన్ని పడవలు, చేపల్ని, రొయ్యల్ని, మాంసాన్ని అమ్ముకు పొట్టపోసుకునే నేలబారు జీవితాలూ కనిపిస్తాయి. చలవ బట్టలతో, షోకుగా దిగిన మమ్మల్ని ఇంకా భయం భయంగా, జాలిగా, వింతగా చూసే ముఖాలు దర్శనమిస్తాయి. 300 సంవత్సరాల కిందటి దైన్యాన్ని తట్టుకోడానికి మనకి శక్తి చాలదు.

"నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం" అన్న శ్రీశ్రీ మాటలు ఆ మధ్యాహ్నమంతా మనస్సులో కదిలాయి.

ఐక్యరాజ్య సమితి - మానవ జాతి సిగ్గుతో తలవంచుకోవలసిన ఈ వ్యాపారానికీ, పీడనకీ గుర్తుగా ఈ బగమోయోని వరల్డ్ హెరిటేజ్ సెంటర్ (ప్రపంచ చారిత్రక కేంద్రం)గా ప్రకటించింది. బగమోయో ఒక భయంకరమయిన పీడకల. మానవుడు బతికున్నంత కాలం సిగ్గుతో తలొంచుకోవలసిన దోపిడీకి, దుర్మార్గానికి సంకేతం.

## 5

ఉదయం ఫెళ్ళున ఎండ లేచి అంతలో మేఘాలు ముసురుకున్నాయి. టిఫిన్ పూర్తయ్యేసరికి హోరున వర్షం. పెద్ద గొడుగు ఇచ్చాడు ఫలహారశాలలో ఉండే నల్లని భారతీయుడు - "నిన్ననే మిమ్మల్ని గుర్తుపట్టాను. పలకరిద్దామనుకున్నాను" అంటూ. పేరు శ్యామ్. హైదరాబాదులో పనిచేసి కాస్త తెలుగు నంచుకున్న మలయాళీ. ఇక్కడ మళయాళీ క్రిస్టియన్లు ఎక్కువ. నిజానికి టాంజానియాలో 40 శాతం క్రైస్తవులు, 40 శాతం ముస్లింలు - మరి స్థానికులు ఎక్కడ? బిక్కుబిక్కుమంటూ 20 శాతం. అయితే నల్లటి వారిలో చాలామంది గడిచిన శతాబ్దాలలో మిగతా మతాల్లో కలిసిపోయారు. ఆ మాటకి వస్తే అమెరికాలో ఉండాల్సిన రెడ్ ఇండియన్లు ఇప్పుడెక్కడున్నారు!?

కెన్నడీ హోటల్ ఖాళీ చేయించి ఊళ్ళోకి తీసుకొచ్చాడు. అక్కడ మరో కారు ఏర్పాటు చేశాడు. లాండ్ రోవర్ అది. నాలుగు చక్రాల కంట్రోలు ఉండే బళ్ళని మాత్రమే ఇక్కడి నేషనల్ పార్కులలోకి వెళ్ళనిస్తారు. జంతువుల మధ్య తిరిగే ఈ బళ్ళు - ఏ మాత్రం ఈడిగిల బడినా ఎంత హానికరమో ఊహించవచ్చు. ఇక్కడ మాతో చేరిన కొత్త గైడ్ బెనిడిక్ట్. డ్రైవరు సైదీ.

ఊళ్ళోకి రాగానే కూరల బజారు మమ్మల్ని ఆకర్షించింది. కీర దోసకాయలు, పచ్చిమిరపకాయలు కొన్నాం. ఇంతలో ఒకాయన చక్కటి తెలుగులో పలకరించాడు - "అయ్యా, మారుతీరావుగారూ" అంటూ. ఆయన సురేష్ కుమార్. ఎలక్ట్రికల్ ఇంజనీరు. ఆదివారం

పూట కరివేపాకు కొనుక్కోవడానికి బజారుకి వచ్చాడు. దార్ ఎస్ సలామ్‌లో మారుతీరావుని చూసి మొదట నమ్మలేక పోయాడు. అయినా ధైర్యం చేసి పలకరించాడు. ఆఫ్రికాలో తెలుగు పలకరింత అడవిలో ఆవకాయలాంటిది. ఆయన్ని అదే అడిగాం. "బాబూ, ఊరగాయలు ఎక్కడయినా దొరుకుతాయా?" అని. పదండి బాబూ అంటూ గుజరాతీ డిపార్ట్‌మెంటల్ స్టోర్సుకి తీసుకొచ్చాడు. వ్యాపారానికి, వలస పోవడానికి గుజరాతీలకి పెట్టింది పేరు. ఇక్కడి వ్యాపారంలో పెద్ద తాంబూలం వారిదే మన దేశపు వారే సిగ్గుపడేంత గొప్పగా శ్రీరాముడు, కృష్ణుడి ఆలయాలు అద్భుతంగా నడుపుతున్నారు. మొత్తం మీద ప్రియా పచ్చళ్ళ బీరువా ముందు గర్వంగా నిలబెట్టాడు యజమాని. మిరప పళ్ళ పచ్చడి నోరూరించింది. గబుక్కున అందుకున్నాం.

సురేష్ కుమార్ భార్య పురిటికి వెళ్ళింది. పదిరోజుల క్రిందటే కూతురు పుట్టింది. "మా గదికి రారా?" అన్నాడు సురేష్ కుమార్. 8,9 తేదీలలో ఇక్కడ ఉంటామని చెప్పాం. మా ఫోన్ నంబర్లు తీసుకుని, తనవిచ్చాడు. ఇంత వివరంగా ఈ విషయం చెప్పడానికి కారణం ముందుంది.

మా కారు బయలుదేరింది. పట్టణం దాటకుండానే మళ్ళీ వర్షం. దారి పొడుగునా టొమాటో పళ్ళు, ఉల్లిపాయల బుట్టలు, నారింజ గుట్టలు, కిత్తలి తోటలు, విరగబూసిన మామిడి చెట్లూ, అరటి తోటలూ, విచిత్రమేమిటంటే ఇన్ని చెట్లున్నా ఇక్కడివారి ఆహారంలో మామిడి, పనస మచ్చుకయినా కనిపించదు. మధ్యాహ్నానికి మొరొగొరో అనే ఊరు చేరాం. అప్పటికి ఆకలి నకనకలాడిస్తోంది. హోటల్‌లో కేవలం అన్నం మాత్రం వండుకుని కందిపొడి, మిరపపళ్ళ పచ్చడి, పెరుగుని ఉసిగొలిపాం. టాంజానియాని నంచుకుంటూ తెలుగు భోజనం మజాగా కుదిరింది.

చక్కని రోడ్డు. ఎండ పడమట వేపు వాలి - కాస్త చలిగాలి ప్రారంభమయే సరికి మికూమీ నేషనల్ పార్కు ప్రాంతాలకి వచ్చాం. ఇక్కడ మదుమలై, బందీపూర్‌ల లాగే ఏడు రక్షిత అరణ్యాలున్నాయి. వీటిని మన దేశంలో sanctuaries అంటారు. ఇక్కడ వీటిని పార్కులంటారు. సెరెంగిటి, గొరొంగోరో, మన్యారా, తరంగిరె, మికూమీ, అరూషా, కిలిమంజారో - ఈ దేశంలో ముఖ్యమైన పార్కులు. వీటిని పార్కులనడం ఒక విధంగా సరికాదు. భగవంతుడు సృష్టించిన జీవరాశి యధాతథంగా, స్వేచ్ఛగా జీవించే ఆలయాలివి. కొన్ని వేల సంవత్సరాలుగా - కాదు - లక్షల సంవత్సరాలుగా - ఈ జీవరాశి ఒక సమన్వయంతో జీవిక సాగిస్తోంది. సింహాలూ, చిరుతపులులూ - జంతువుల్ని తింటాయి. దుమ్ముల గొండి, నక్కలూ - ఆ జంతువులు వదిలేసిన మాంసాన్ని భక్షిస్తాయి. ఏనుగులూ, జిరాఫీలు, రినోలు శాఖాహారులు. అందరికీ, అన్నిటికీ సమగ్రమయిన ఆహారాన్ని ఇచ్చే ప్రకృతి ఒడి ఇది. సెరెంగిటీకి కీన్యాకు, టాంజానియాకు వంతెన వేసే పార్కు. ఎక్కువ భాగం టాంజానియాలో, కాస్త భాగం కీన్యాలో ఉంది. వేసవిలో నీరు ఇక్కడ కరువయితే జంతువులన్నీ కీన్యాకు వలసపోతాయి. ఎప్పుడు వలస పోవాలో వాటి కెవరు నేర్పారు? జనవరి, ఫిబ్రవరి నెలల్లో సెరెంగిటి భగవంతుని సృష్టికార్యానికి అద్దం పట్టే అద్భుతమయిన నేపధ్యం. అన్ని జంతువులూ ప్రసవించే సమయమిది. ఉదయం పార్కులోకి ప్రవేశిస్తే వేలాది పసికూనలు ఈ ప్రపంచంలోకి పడడానికి పడే తాపత్రయం చూస్తాం. మధ్యాహ్నం మనం ఇళ్ళకు మళ్ళే వేళకి చెంగు చెంగున పసికూనలు మునిగాళ్ళమీద లేస్తాయి. తల్లులు కంటి రెప్పల్లాగ వాటిని కాపాడుతుంటాయి. వాటి కన్ను మూత పడితే పసికందుల్ని ఏ నక్కలో, దుమ్ములగొండులో, రాబందులో తన్నుకు పోతాయి. సృష్టిలో విచిత్రమిది. ఒక ప్రాణి మరొక ప్రాణికి ఆహారం. అన్నీ పక్క పక్కనే తిరుగుతూంటాయి. ఏ ప్రాణీ మరొక ప్రాణిని అవసరం లేనిదే ఎదిరించదు. వేటాడదు. జంతువులలో అపూర్వమయిన 'నియతి' ఉంది. కావలసినా, అక్కరలేక పోయినా - వినోదానికీ, వ్యాపారానికీ జంతువుల్ని కబళించే జంతువు ఒక్కటే - మనిషి!



అడవిలో భయంకరమయినదీ, మరే జంతువూ దాని జోలికి రానిదీ ఒకటుంది - ఏనుగు. ఒకప్పుడు సింహాన్ని పది దుమ్ములగొండులూ, 3 అడివి దున్నలూ ఎదిరించవచ్చు. కానీ ఏనుగు జోలికి ఏ జంతువు రాదు. రాడానికి సాహసించదు. ఏనుగులు మందలు మందలుగా కలిసి మసులుతాయి. పసిపిల్లలు తల్లిదండ్రుల కాళ్ళ మధ్యనే పారాడుతాయి. సింహాలకి పది పది గజాల దూరంలో మా వాన్‌తో నిలుచున్నాం కానీ, ఏనుగుని అల్లంత దూరంలో రోడ్డు దాటుతుండగా చూస్తే డ్రైవరు వాన్ ఆపేస్తాడు. బిడ్డతో వెళ్ళే ఆడ ఏనుగయితే మరీ ప్రమాదం. మగ ఏనుగు రోడ్డు దాటినా ఆపేస్తాడు. మగ ఏనుగు రోడ్డు దాటినా పిల్లలు దాటే వరకు నిలబడి చూసి మరీ కదులుతుంది. సమీపంలో వాన్ ఉంటే ఏ శషభిషలూ పనికిరావు. 30 గజాల దూరంలో మనం నిలిచి వాటికి మర్యాదగా తోవ ఇవ్వవలసిందే ఒకే ఒక్కసారి ఒక టూరిస్టుకి ప్రమాదం జరిగిందట. ఒక విదేశీ మహిళ నిర్జంగా ఉన్న ప్రాంతంలో మూత్రవిసర్జకి వాన్ దిగింది. దట్టంగా ముసిరిన చెట్ల వెనుక అప్పుడే ఏనుగు ప్రసవించింది. ఈ వ్యక్తిని చూసి భయంకరంగా విజృంభించి, తొక్కి చంపేసింది. ఆ సంఘటన వినా- ఎంతటి క్రూర జంతువయినా వాన్‌లో యాత్రికులు ఉండగా ఎదిరించదు. అయితే ముఖ్యసూత్రం ఎట్టి పరిస్థితులలోనూ వాన్ తలుపు తియ్యరాదు. నిర్దేశించిన స్థలాలలో సేద తీర్చుకుని ఫలహారమో, ఆహారమో తీసుకోడం తప్పు - బయటికి రాకూడదు.

వెంటనే భర్తృహరి జ్ఞాపకం వచ్చాడు నాకు. సింహానికి "మత్తేభ కుంభ పిసిత గ్రహ లాలన" ఉన్నదన్నాడు కదా సుభాషిత కారుడు. గైడ్‌ని అడిగాను - సింహం ఏనుగుని చంపుతుందా అని, నవ్వాడు గైడ్ ఆ ప్రసక్తే లేదన్నాడు. సింహానికి పెద్ద పీట వెయ్యడానికి మృగరాజు తినే ఆహారం అంత గొప్పగా ఉండాలన్నది కవి సమయమేమో, విష్ణుమూర్తికి చక్రపొంగళి పెడతాం కదా? అప్పడాలూ, గుమ్మడి వడియాలూ పెట్టం కదా! కానీ ఏనుగుని వేటాడే జంతువు ఒక్కటే ఉంది - మనిషి! దంతాల కోసం వీరప్పన్ అనుచరులతో ఎన్నింటిని చంపాడో - అది చరిత్ర. కానీ అరణ్యంలో ఏ జంతువూ ఏనుగు జోలికి పోదు. ఒక్క ఏనుగే వయస్సు వల్లనో, మరే అనర్థం వల్లనో దానంతటదే మరణిస్తుంది. అంతే. టాంజానియా పర్యటన అంతటిలోనూ ఒకే ఒక్క ఏనుగు కంకాళాన్ని చూశాం. అరూషా నేషనల్ పార్కు ముఖద్వారం దగ్గర ఏనుగు శిరస్సుని ఉంచారు.



ఇక ప్రస్తుతానికి వస్తే మికూమీ రోడ్డు పొడుగునా జంతువులు కనిపిస్తూనే ఉన్నాయి. తరచుగా కనిపించే జంతువులు - గుంపులు గుంపులుగా లేళ్ళు (ఇంపాలా అంటారు వీటిని), దుప్పిలూ, కణితి (antelope) వాన్‌నీ, మనుష్యుల్నీ చూసి చెంగు చెంగున పరుగులు లేళ్ళు తీసే దృశ్యం అపూర్వం. వాటి చూపులు అల్లసాని పెద్దన్నని, వరూధినిని అలవోకగా గుర్తుచేస్తాయి. "ఎవ్వతెవీవు భీతహరిణేక్షణ" లేడి కళ్ళ అందం - అందునా బెదిరిన లేడికళ్ళగురించి చెప్పనే అక్కరలేదు. అందునా బంగారు లేడి - అదిన్నీ మాయలేడి (మారీచుడి మారువేషం) అమ్మవారిని ఆకర్షించడంలో ఆశ్చర్యం లేదు.


బహుశా ఒక్క ఆఫ్రికాలోనే కనిపించే జంతువులు జిరాఫీ.

ఒక్క జిరాఫీ కనిపిస్తే - బండ గుర్తు - దాని చుట్టు పక్కల మరొక జిరాఫీ ఉండి తీరుతుంది. జిరాఫీ జంటలుగా తిరుగుతాయి. వీటిలో ఒక తెగని మసాయ్ జిరాఫీ అంటారు. వీటికి తల మీద రెండు కుచ్చుకొమ్ములుంటాయి. పొడవాటి మెడని సాచి, ఆకాశం ఎత్తుని ఉన్న చెట్ల కొమ్మల ఆకుల్ని పెదాలతో అందుకొంటాయి. అతి భయంకరమయిన తుమ్మ ముళ్ళ చెట్లు (వీటిని acacia అంటారు) ఆకుల్ని పెదాలతో కోసుకు తింటాయి. తుమ్మముళ్ళని చూస్తే వీటి మధ్య ఉన్న ఆకుల్ని అంత సుతారంగా ఎలా అందుకుంటుందా అని ఆశ్చర్యం కలుగక మానదు. లేడి తర్వాత అంత అందమయిన కళ్ళు గల జంతువు జిరాఫీ. పెదాలు అతి సున్నితం. జిరాఫీ యాత్రికుల్ని చూడగానే మంత్రం వేసినట్టు నిలిచిపోతుంది. దాని కళ్ళలో మన ఉద్దేశాన్ని బేరీజు వేస్తున్న సందిగ్ధం తెలుస్తూంటుంది. ఒక నిర్ణయానికి ఆలశ్యంగా వస్తుంది గావును - మనం నిలబడి చూసిన అయిదారు నిముషాలకు పరిగెత్తి దూరంగా పోయి నిలిచి, తన జంట కోసం ఎదురు చూస్తుంది.

ఇక రోడ్డు పొడుగునా కనిపించేవి కోతులు. మనం చూసే మామూలు కోతులు కావు. నీలి రంగు ముఖాలతో, పూలు బంతుల్లాంటి శరీరంతో - దాదాపు చిన్న సైజు పొట్టేలు అంత ఆకారంతో కనిపిస్తాయి. వీటిని బబూన్లు అంటారు. రోడ్డు పక్క రాయి మీద సాయంకాలం షికారుకి వచ్చి కూచున్న పెద్ద మనిషిలాగా చేతులు ముణుకుల మీదుంచుకుని కూర్చున్న దృశ్యం - డార్విన్ సిద్ధాంతాన్ని సమర్థిస్తున్నట్టనిపిస్తుంది. మన భంగిమల్నీ, చేష్టల్నీ అనుకరిస్తున్నట్టు కనిపించే 'కోతి'ని ఎన్ని గంటలు చూసినా ఆసక్తిగా ఉంటుంది. తల్లి మెడని కరుచుకు వేలాడే పసిపిల్లలు శిశుమర్కట న్యాయాన్ని స్ఫురణకి తెస్తుంటాయి.

ఎంత చూసినా తనివి తీరని - చూశాక దృష్టి మరల్చుకోలేని జంతువు చారల గుర్రం (జీబ్రా). ఏ చిత్రకారుడు ఏ కుంచెతో అంత అందమయిన డిజైనుని అన్ని వందల చారల గుర్రాల మీద గీశాడా అనిపిస్తుంది. ఎక్కడ పడితే అక్కడ రెండు, మూడు, పదుల సంఖ్యలో కనిపించే ఈ చారల గుర్రాలు వేగంలో గుర్రాన్ని, శక్తిలో గాడిదనీ గుర్తుచేస్తుంటాయి. దాని శరీరంలో ఒకే ఒక బలమయిన ఆయుధం వెనుక కాళ్ళు - గాడిదలాగే. ఆ కాలి కి దెబ్బ తగిలితే ఆ పాటి జంతువు తారున చచ్చి ఊరుకుంటుంది.

మికూమీ నేషనల్ పార్కు - మాదారికి కుడివేపుగా కనిపించింది. పార్కులోకి సాయంకాలం ఆరు తర్వాత ప్రవేశం లేదు. పార్కుల్లో ముఖ ద్వారానికి దగ్గరగా సురక్షితంగా ఉండే చోట - యాత్రికులు కావాలనుకుంటే రాత్రిళ్ళు ఉండే ఏర్పాటు ఉంది. వీటిని కాంప్ సైట్స్ అంటారు. జంతువుల్ని రాత్రివేళల్లో గమనించాలనుకునే వాళ్ళు (వీటిలోంచి ఎట్టి పరిస్థితుల్లోనూ బయటికి రావడానికి వీలులేదు) - బహుశా ప్రత్యేకమయిన అనుమతితో చిత్రాలను తీసుకునే ఫొటోగ్రాఫర్లు - ఇక్కడ ఉండవచ్చు.



మేము మన్యారా నేషనల్ పార్కు చూడటానికి వెళ్ళినప్పుడు మేం ఉన్న లాడ్జిలో ఇలాగే డేరా వేసుకుని హాలెండు నుంచీ వచ్చిన ఓ యువకుడు, అతని గర్ల్‌ఫ్రెండూ కలిశారు. డేరాలోనే కూర్చోడానికి రెండు కుర్చీలు, ఒక తెర, దాని వెనక చిన్న మంచం - ఒక దీపం - కేవలం పదిహేను నిముషాలలో డేరా సిద్ధం. వీరు సెరెంగిటీలో ఆరు రాత్రులున్నారు. ఆయన్ని అడిగాం: "ఎన్ని సింహాలు చూశారు?" అని. సమాధానం విని షాక్ అయాం. "దాదాపు 30" అన్నాడు. రాత్రి సింహాల అరుపులూ, నక్కల అరుపులూ, దుమ్మలగొండి

అరుపులూ వినిపిస్తాయట - డేరా సమీపంలోనే. "భయం వెయ్యదూ!" అంటే నవ్వాడు. భయం వేసే వ్యక్తి అక్కడెందుకుంటాడు? జంతువుల నివాస స్థలంలో వాటి జీవన సరళిలో పాలు పంచుకోవడం ఒక వినోదం.

అలాగే - అరూషా, గొరొంగోరో పార్కులు కనిపించేలాగా హోటళ్ళున్నాయి. అరూషా పార్కుల్లోనే మొమెల్లా లాడ్జి ఉంది. ఈ స్థలాల్లో మన పంజరంలో ఉంటాం. జంతువులు బయట స్వేచ్ఛగా తిరుగుతూ ఉంటాయి.

సృష్టి విలాసాన్ని - ప్రాథమిక రూపంలో చూడడం ఓ ఆవేశం, ఓ మత్తు - అన్నిటికీ మించి ఓ అవకాశం.

మికూమీ పార్కుకి పదిహేను కిలోమీటర్ల దూరంలో రోడ్డు మీద ఓ చిన్న మోటల్ ఉంది (ఇది హోటల్ కంటే చిన్నది, సత్రం కన్నా పెద్దది.) - దాని పేరు జెనిసిస్ మోటల్. అక్కడ రాత్రి మకాం.

మళ్ళీ మా తినుబండారాలను విప్పి - తెలుగు రుచుల్ని మేళవించి - ఆఫ్రికాలో మరొక రాత్రికి స్వాగతం పలికాం - ఉదయం లేస్తూనే మొదటి నేషనల్ పార్కుకి వెళ్ళాలని నిర్ణయించుకుని.

✷✷✷

## 6

ఉదయం కాఫీ తాగుతూనే ఆరుగంటలకే బయలుదేరిపోయాం మికూమీ పార్కుకి. జంతువులు బయటికి వచ్చి జీవనం ప్రారంభించే వేళలు ఉదయం, సాయంకాలం. ఈ పార్కుల్ని సందర్శించడానికి డబ్బు చెల్లించాలి. ఈ దేశం ఆదాయంలో ఇది ముఖ్యమైనది. లోనికి వెళ్ళే వాన్ నంబరు, ఎంతమంది వెళ్ళేదీ, డ్రైవరు, గైడ్ పేర్లు - ఇవన్నీ రాసి ఇవ్వాలి. వెళ్ళేది అడివిలోకి, క్రూరమృగాల మధ్యకి. కనుక తిరిగి వచ్చే ముందు శాల్తీలన్నీ క్షేమంగా వచ్చిందీ లేనిదీ చూస్తారు.

వచ్చింది అడివిలోకి - పార్కు ముఖద్వారం నుంచే చిన్న చలి కితకితలు పెట్టడం ప్రారంభించింది.

అప్పుడే అరణ్యం మేలుకుంటోంది. జంతువులకి ఒకటే యావ - ఆహారం, విహారం. అందుకనే ఈ రెంటికీ మాత్రమే పరిమితమైన మానవుడు జంతువు కిందే లెక్క.. ఇంతకు మించినదేదో సాధించగలిగే శక్తి, ఆలోచన మానవునికి భగవంతుడు ప్రసాదించాడు. అదేమిటో తెలియని వారికి తమ జీవితాలను సుభాషితాలుగా మార్చిన మహాత్ముడు, మదర్ థెరిస్సా వంటి దేవతల్ని ప్రసాదించాడు.

మికుమి ముఖ ద్వారం దాటుతూనే ఏనుగుల కుటుంబం తొండాలు ఎత్తి మాకు స్వాగతం పలికాయి. ఎండ లేస్తున్న కొద్దీ వాతావరణం వేడెక్కింది. పార్కునిండా పరచుకున్న రెల్లు - దాన్ని సెవాన్నా గడ్డి అంటారు. ముఖ్యంగా సింహాలు ఈ గడ్డిలో తల దాచుకుంటే - అవి కదిలితే తప్ప గుర్తు పట్టడం కష్టం. లాండ్ రోవర్‌లో జంతువుల్ని వాన్‌లో ఉండే చూడటానికి మీద టాపు తెరచుకుంటుంది. ఈ పార్కుల్లో జంతువుల్ని హాయిగా, క్షేమంగా చూడాలన్నా, ఫొటోలూ, వీడియోలూ తీసుకోవాలన్నా ఈ ఏర్పాటు చాలా సౌకర్యంగా ఉంటుంది. గైడ్ బెనెడిక్ట్ కళ్ళు చెట్ల మధ్యనుంచీ దూసుకుని చూస్తున్నాయి. జంతువుల్ని గుర్తుపట్టగలగడం, ఎక్కడ ఉంటాయో ఊహించగలగడం వారికి అలవాటు.

ఈ పార్కుల్లోకి వచ్చేవారి మొదటి కల - సింహాల్నీ, చిరుత పులుల్నీ చూడటం. నాలుగయిదు మలుపులు తిరిగిన అరగంటకే బెనెడిక్ట్ అరిచాడు - "దూరంగా రెల్లు వెనుక సింహం!!" అంటూ, ప్రసాదరావుగారు వీడియో తీసి 'జూమ్' చేశారు, "అది సింహం

కాదు – దుమ్మలగొండి" అని తేల్చారు. బెనెడిక్టూ సందేహంలో పడ్డాడు. మరొక పక్క నక్క పరిగెడుతోంది. మీద రాబందులు ఎగురుతున్నాయి. ఇవన్నీ ఒకే ఒక్క విషయాన్ని సూచిస్తాయి. దగ్గర్లో సింహం ఉంది. ఏదో జంతువుని వేటాడి ఉంటుంది.



మరో 40 గజాల దూరంలో 'హిప్పో పూల్' (హిప్పోలు ఉండే చిన్న చెరువు) ఉంది. దానికి 20 గజాల ముందుగానే సింహం కనిపించింది. మేం నలుగురం తుళ్ళిపడ్డాం. టాంజానియాలో ఆసక్తి గొలిపే మొదటి దృశ్యమిది. కేవలం పది నిమిషాలముందు ఓ అడివి దున్నని (wild beest) వేటాడి – పొట్ట చీల్చి తీరుబాటుగా సేవిస్తోంది – శివంగి. వాన్ మరి కాస్త ముందుకి వెళ్ళింది. అనుభవం లేక మాకు కాస్త కాళ్ళు వణికాయి. నేను అక్కడినుంచే ఇండియాలో మా అబ్బాయికి ఫోన్ చేశాను. అంతలో మరో పది గజాల దూరంలో విశ్రమిస్తున్న మరో శివంగి కనిపించింది. మా ఉత్సాహానికి అవధిలేదు.

నిర్మలమయిన ఆ ఉదయపు వేళ ఓ అడివి దున్నని ఫలహారం చేస్తోంది శివంగి. కాసేపటి కిందటి వరకూ తమతో ఉన్న అనుచరుణ్ణి నష్టపోయిన – మిగతా అడవి దున్నలు దూరం నుంచీ బీరు పోయి చూస్తూ నిలబడిపోయాయి. మరికాస్త దూరంలో ఈ మారణ కాండని గమనిస్తున్న చారల గుర్రాల గుంపులు. వాటిలో చలనం లేదు. ప్రకృతి ఒక్క క్షణం నిశ్చేష్టమయిపోయింది. జంతువులకి ఆలోచన ఉండకపోవచ్చు. కానీ instinct ఉంటుంది. తమ కళ్ళముందే మరొక జంతువుకి ఆహారమయిన సాటి ప్రాణీ పట్ల వాటిలో స్పదన స్పష్టంగా తెలుస్తోంది.

ఇది సృష్టి వైచిత్రి. సింహానికి ఇది ఆహారం. అడివి దున్నకి ప్రాణం. సింహం తిని వదిలేశాక – మిగతా మాంసాన్ని తినడానికి – దగ్గరికి వచ్చే ధైర్యం లేనిదుమ్మలగొండి, నక్కలు ఎదురు చూస్తున్నాయి. మరొక పక్క వందపైగా రాబందులు. అందరికీ, అన్నిటికీ ఇది ఆహారం, రాబందుల్ని scavangers అంటారు. అంటే అవశేషాల్ని తుడిచిపెట్టే ప్రాణులు సాయంకాలానికి చచ్చిన ప్రాణి ఎందరో కడుపులు నింపుతుంది. ఇంకా మిగిలిన అవశేషాల్ని కోట్లాది సూక్ష్మ క్రిములు ఫలహారం చేస్తాయి. భూమిసారాన్ని ఈ క్రిములు పెంచుతాయి. కొన్ని కోట్ల సంవత్సరాలుగా సృష్టిలో సాగుతున్న 'వలయం' (food cycle) ఇది. ఎంత జీవన వైవిధ్యం! సృష్టిలో సహజమయిన ఏర్పాటు! ఎరువుల ద్వారా ఈ సూక్ష్మక్రిముల్ని చంపే మనం సృష్టిలో అద్భుతమయిన ఏర్పాటుని ఎంతగా భంగపరుస్తున్నాం!

ఒక్కసారి కడుపు నిండాక – వారం రోజుల పాటు సింహానికి ఆహారం అవసరం లేదు. మనలాగే రోజూ మూడు పూటలూ తినే ఏర్పాటు జరిగిఉంటే – రోజుకిఎన్ని అడవి దున్నలు మాయమయేవి! అడవి అచిరకాలంలో స్మశానమయేది. కడుపు నిండిన సింహం పక్కనుంచే మందలు మందలుగా జంతువులు నడుస్తుంటాయి. అయినా అటువేపు దృష్టిని కూడా సారించదు సింహం!

ప్రస్తుతం 60 కేజీల మాంసాన్ని నంజుకున్న రెండు శివంగులు ఆపసోపాలు పడుతున్నాయి. ఒక శివంగి రక్తంతో ఎరుపెక్కిన మూతిని నాలికతో తుడుచుకుంటూ దగ్గర్లో ఉన్న చెరువు దగ్గరకి నడిచింది. నీరు తాగాక బద్దకంగా సెవన్నా గడ్డిలో విశ్రమించింది. దాదాపు గంట పైగా అక్కడే ఆగిపోయాం. మాలాగే వచ్చిన మరికొందరి యాత్రికుల వాన్‌లు నిలిచి ఉన్నాయి. ఈ దృశ్యం ఒకరోజుకి, ఒక యాత్రకి సరిపోయేంత తృప్తినిచ్చింది.

మళ్ళీ జెనిసిస్ మోటల్‌కి వచ్చి స్నానాదికాలు, ఫలహారం ముగించుకుని బయలుదేరాం. అప్పటి అరణ్యం పూర్తిగా మేలుకుంది. బిలబిలమంటూ జిరాఫీలూ, చారల గుర్రాలూ, బబూన్లూ, ఏనుగులూ సంచరిస్తున్నాయి.

మధ్యాహ్నం చింతచెట్టు కిందకి చేరాం. మాకు రెండు వందల గజాల దూరంలో సింహం. ఇక్కడ మేం 'పులి' హోర, పెరుగన్నం సేవించాం. అవసరాలు మనుషులకీ, జంతువులకీ సహజమే. కానీ మరొక ప్రాణిని హింసించి పొట్టపోసుకునే జంతుప్రవృత్తిని ఇంకా మానవుడు కొనసాగిస్తున్నాడు. అదే ఆశ్చర్యం. చెట్టు వదిలిన ఫలాన్ని భుజించడం Evolved Species అయిన మానవుడు ప్రకృతికి చేసే ఉపకారం - కాదు - బాధ్యత.



హిప్పోల వీపు చర్మం పలచన. ఎండ వేడికి అంత శరీరం కుతకుతలాడిపోతుంది. కనుక రోజంతా నీటిలో మునిగే ఉంటాయి. రాత్రి ఏ నాలుగో ఝామునో బయటికి వచ్చి కావలసిన ఫలహారం చేసి (అవి శాఖాహారులు) మళ్ళీ నీటిలోకి తరలిపోతాయి. నీటి మట్టాన పెద్ద శరీరాలు తెలుస్తుంటాయి. హిప్పో పూల్ నిండా పది పైన హిప్పోలు తెలిశాయి.

మధ్యాహ్నానికి - రెండు శివంగులూ - మా వాన్ వెళ్ళే తోవ పక్కనే ఉన్న ఆకాశియా చెట్ల నీడకి చేరుకున్నాయి. ఇప్పుడు మాకూ వాటికీ పది గజాల దూరం. 30 - 40 కేజీల మాంసం కడుపులో బరువుగా ఉన్నది గావును - అది శరీరంలో ఇమడడానికీ వ్యవధికావాలేమో. నీడలో కూర్చుని అలసట పడుతున్నాయి, (మృష్టాన్న భోజనం చేస్తే శరీరంలో అలసట రావాలనేవాడు మా మిత్రుడు, అట్లూరి పుండరీకాక్షయ్యగారి సోదరుడు - బలరాం.) మేం కెమేరాలు బయటికి తీస్తే దగ్గర్లో ఉన్న శివంగి బద్దకంగా మమ్మల్ని చూసింది. ఆ కళ్ళల్లో క్రౌర్యం, మత్తు మమ్మల్ని వణికించింది. ఒక్కసారి వాన్‌మీదకి లంఘిస్తే? ఏం భయం లేదని ధైర్యం చెప్పాడు డ్రైవర్ సైదీ.



సాయంకాలం వరకూ తిరిగినా మిగతా జీవరాశుల వైవిధ్యం కళ్ళబడింది కానీ ఉదయాన్ని మరిపించే దృశ్యం కనిపించలేదు. అంతకు మించి సింహం కనిపించలేదు. "శివంగుల్ని చూశాం కానీ మృగరాజు ఎక్కడ?" అనుకుంటూ మరునాడు మికూమి నుంచీ బయలుదేరాం.

# 7

ప్రపంచంలో భయపెట్టేదీ, బాధపెట్టేదీ ఒకటుంది. దాని పేరు అజ్ఞానం. అజ్ఞానం చీకటి. చీకటిలో ఏముందో తెలీదు. తెలియనివన్నీ ఊహలో నింపుకుని భయపడతాం. అక్కడ పాము ఉందా, పులి ఉందా, గాజుపెంకు ఉందా, తుపాకీ ఉందా - మీ ఆలోచనంత పదునుగా భయం రెచ్చుతుంది. జ్ఞానం వెలుగు. మనిషి చచ్చిపోయాక ఏమవుతాడు? తెలీదు. అందుకని 'మృత్యువు' భయపెడుతుంది. చచ్చిపోయాక స్వర్గానికి వెళ్తాడు అని ఎవరయినా గ్యారంటీ ఇవ్వగలిగితే చావుని ఆహ్వానిస్తాడు. కవి ప్రేయసితో అంటాడు: "మరుజన్మకు కరుణిస్తావా, ఈ క్షణమే మరణిస్తాను" అని. ఆ కవి నా మిత్రుడు, సహృదయుడు వెన్నెలకంటి.

భయాన్ని, బాధని ఇంతగా అలంకరించడానికి కారణం - మరునాటి ప్రయాణం. మా టాంజానియా యాత్రలో పీడకలలాంటి రోజు అది. కారణం - ఆ ప్రయాణంలోని అసౌకర్యం కెన్నెడీకి తెలియకపోవడం - అది అసౌకర్యమని ప్రయాణం చేసేదాకా మాకు తెలియక పోవడం.

ఉదయం మికూమీ నుంచీ బయలుదేరి రెండు గంటల సమయంలో దార్ ఎస్ సలామ్ చేరాం. చక్కని ఇండియన్ రెస్టారెంటుకి తీసుకువెళ్ళాడు కెన్నడీ. హోటల్ పేరు రెడ్ ఆనియన్ (ఎర్ర ఉల్లిపాయ). టేబులు ముందు కూర్చోగానే ఆ హోటల్‌ల్లో పని చేసే ఒక యువకుడు - అసిస్టెంటు మేనేజరు అనుకుంటాను - వచ్చి ఆవేశంగా నా చేయి పట్టుకున్నాడు - "మిమ్మల్ని కలిసినందుకు చాలా ఆనందంగా ఉంది" అని ఇంగ్లీషులో అన్నాడు. నా పరపతి అంత విస్తృతం కాకపోయినా తెలుగు రాని ఈ అభిమాని ఏ ప్రాంతంవాడా అని విస్తుపోతుండగా - అచ్చమయిన తెలుగులో మాట్లాడాడు. అతను తెలుగువాడు, విశాఖ జిల్లావాడు, నా జన్మస్థలం విజయనగరం వాడు. తురకల చెరువు దగ్గర అతని ఇల్లు. పేరు అమానుల్లా ఖాన్. నన్ను చూసిన ఆనందం అతని ముఖంలో, మాటలో, పట్టుకున్న చేతిలో తెలుస్తోంది. వెంటనే మాయమయిపోయాడు. మేమెవరో తెలీని మరో యువకుడు - తన సహచరుడి ఆనందాన్ని అర్థం చేసుకుని గౌరవంగా భోజనం పెట్టాడు. మళ్ళీ మా తినుబండారాల బుట్టని విప్పి టాంజానియా అన్నానికి తెలుగు రుచులు జోడించాం.

ఇప్పుడు అమానుల్లా ఖాన్ - ఎంత వెదికినా కెమేరా దొరకలేదంటూ - దిగులుగా. సమస్యని నేనూ, ప్రసాదరావుగారూ పరిష్కరించాం. వాళ్ళకి ఫొటోలు తీసి ఈ మెయిల్ అడ్రసు తీసుకున్నాం. వెంటనే కిల్వా బయలుదేరుతున్నామని తెలిసి భయపడ్డాడు. "ప్రయాణం చాలా కష్టం. చీకటి పడ్డాక వెళ్ళడం బొత్తిగా మంచిది కాదు" అన్నాడు.

కెన్నడీ కూడా ఈ రాత్రికి దారిలోనే బస చేసి పొద్దున్నే వెళ్ళండన్నాడు. అక్కడి నుంచీ ఆరు గంటల ప్రయాణం. ఇబ్బందయినా, ఆలశ్యమయినా రాత్రికి కిల్వా చేరిపోతే ఉదయం తీరికగా తిరగవచ్చు, కాలం కలిసి వస్తుందని మా భావన. బయలుదేరాలనే నిర్ణయానికి వచ్చాం. కలిగే ఇబ్బంది కెన్నెడీకి తెలీదు.

దార్ దాటగానే టైరు పంక్చరయింది. దానిని వేయించి స్టెపినీ బిగించారు. ఇప్పుడు స్టెపినీకి పంచరు ఉందని తేలింది. తీరా టైరు విప్పితే లోపలి ట్యూబు పనికిరానంత చెడిపోయింది. మొత్తం మీద 3 సార్లు టైర్లు మార్చి అయిదున్నరకి ఊరు వదిలాం. బెనిడిక్ట్ స్థానంలో కొత్త గైడ్ వచ్చాడు. పేరు గిడియన్. "ఎన్ని గంటలకి చేరుతాం" అనడిగాను. పదకొండు అన్నాడు. వాళ్ళు తరచు తిరిగే రాస్తా. వివరాలు వాళ్ళకి బాగా తెలుస్తాయనుకున్నాం. 6 గంటలకి రోడ్డు ఎక్కాం. ఒక గంట గడిచాక మట్టి రోడ్డు ప్రారంభమయింది. భయంకరమయిన గతుకులు, చుట్టూ దట్టమయిన అడివి - ఎక్కడా మనుష్య సంచారం లేదు. వాన్ కుదుపుల్లో ఒళ్ళు హూనమవుతోంది. ఉదయం నుంచీ ప్రయాణం చేస్తున్నామేమో - శరీరాలు డస్సిపోయాయి.

పోను పోను అలసట, విసుగు ఎక్కువయింది. అంతా చీకటి. పదకొండు దాటింది. పన్నెండు దాటింది. ఎక్కడికి వచ్చాం? తెలీదు. ఇంకా ఎంత సేపు ప్రయాణం? తెలీదు. పోనీ, ఈ గతకులరోడ్డు నుంచీ ఎప్పటికి విముక్తి తెలీదు. అసలయిన ప్రశ్న - కిల్వాలో ఏం

చూడబోతున్నాం? తెలీదు. క్లుప్తంగా "చరిత్ర". ఇది అజ్ఞానానికి పరాకాష్ట, ఇందుకు శ్రమ రాను రాను ఇనుమడించింది. విసుగుతోపాటు, కాస్త భయం - అసలు స్థిమితంగా గమ్యం చేరగలమా అన్న సందేహం - ఇన్ని తోసుకొచ్చాయి. ఒకరినొకరం సరదా కబుర్లతో బాధని మరిపించాలనే దొంగ ప్రయత్నం చేశాం. అది దొంగ ప్రయత్నమేనని మాకే అర్థమయిపోయింది. రాత్రి 2 గంటలకి ఓ చిన్న గ్రామానికి వచ్చాం. ఇదే "కిల్వా" అన్నారు. 17 గంటలు ప్రయాణం చేసి వచ్చి ఇక్కడ చూసేది ఏమిటి? ప్రశ్న తర్వాత. మొదట బస ఎక్కడ? గిడియన్ అడ్రస్ పట్టుకోలేకపోయాడు. అంతే. నిస్సహాయత కోపంగా మారి కట్లు తెచ్చుకుంది. మరో అరగంటకి విశాలమయిన స్థలానికి చేర్చాడు. దూరదూరంగా కాటేజీలు కనిపిస్తున్నాయి.

ఆ రాత్రి భోజనం హుస్సేన్ అనే నల్లనివాడు భోజనాన్ని తెచ్చిపెడతానన్నాడు. రెండున్నరకి చెయ్యి అందుకొన్నది నోటికి అందించి మంచాల మీద వాలిపోయాం.

తెలియని స్థలానికి, తెలియచెప్పలేని వ్యక్తులతో, భాషకూడా సరిగ్గా రాని గైడ్‌లతో బయలుదేరడమే బాధాకరం. టాంజానియాలో ఈ అనుభవం తర్వాత మరేదీ మమ్మల్ని ఇబ్బంది పెట్టలేదు. ఈ పెద్ద గీత పక్కన మిగతావన్నీ చిన్నగీతలుగానే నిలిచాయి.

✡✡✡✡

ఉదయం కాటేజ్‌లోంచి బయటకు రాగానే ఒక్కసారి ఊపిరి నిలిచిపోయింది. క్రితం రాత్రి అలసటని మటుమాయం చేసేంత అద్భుతమయిన దృశ్యం కళ్ళముందు నిలిచింది. మా కాటేజ్ పక్కనే హిందూ మహా సముద్రంలోకి చొచ్చుకు వచ్చిన చిన్న పాయ. ఏ ఇటలీలో మిలన్‌నో, అమెరికాలో లాంగ్ ఐలెండ్‌నో గుర్తుచేస్తోంది. నీలపు ఆకాశాన్ని ముంచెత్తే సూర్యోదయం ఎరుపు. కింద కనుచూపు మేర వరకూ నీలపు నీటి తెర.

టాంజానియాలో కొబ్బరి, వెదురు సమృద్ధిగా దొరుకుతాయి. కనుక గుడిసెలు మన దేశంలో లాగే కొబ్బరి ఆకుతోనే కప్పుతారు. పరాకుగా చూస్తే ఏ భీమునిపట్నమో, కాకినాడో జ్ఞాపకం వస్తుంది. ఇక్కడ ప్రతీ పడక గదిలోనూ తప్పని సరిగా ఉండే ఏర్పాటు - దోమతెర. ఆఫ్రికా దోమలకీ, మలేరియాకీ చాలా దగ్గర చుట్టరికం. దూరదూరంగా నిర్మించిన కాటేజీల మధ్య పలచగా పరచుకున్న ఎండ. గుర్రుపెట్టి నిద్రపోతూ ఉండుండి గర్జించే కుంభకర్ణుడిలాగా సముద్రపు అలల హోరు, ప్రాణవాయువుని హరించుకున్న చల్లటి గాలి - వాతావరణాన్ని కళ్ళతో అరగంట సేపు ఆపోశన పట్టేశాను. అప్పుడు మా ఆవిడ కళ్ళిప్పింది. మా పక్క కాటేజీలో ప్రసాదరావు దంపతులు.

నిన్నటి రాత్రి నిస్పృహకి విడాకులిచ్చి చక్కటి కాఫీని సేవించాం. మేం ఎక్కడ, ఏ హోటల్‌లో దిగినా భోజనాల ఏర్పాటు నా గదిలోనే. నోటికి హితవయిన భోజనం - అది మృష్టాన్నమే కానక్కరలేదు - తగుమాత్రం నిద్ర ఉంటే నరకంలో కూడా నాలుగు నెలలు వుండి తిరిగి రావచ్చు - దువ్వూరి రామిరెడ్డిగారన్నట్టు "ఇలకు రాకపోక నాకు స్వేచ్ఛయున్న..."

ఏమయినా స్నానాలు ముగించుకుని టిఫిన్‌కి రెస్టారెంటుకి చేరాం. ఆఫ్రికా అనగానే గుర్తొచ్చేది ఒక విచిత్రమయిన చెట్టు. దాన్ని బావ్‌బాబ్ అంటారు. మర్రిచెట్టుని వేళ్ళతో పెకలించి తల్లక్రిందులుగా నిలబెడితే ఎలా ఉంటుంది? వేళ్ళు ఆకాశాన్ని చుస్తూ, బలమైన మొండెం నేలలో - బావ్‌బాబ్ అలా ఉంటుంది. ఫ్రాన్స్‌కి ఐఫిల్ టవర్‌లాగ, అమెరికాకి లిబర్టీవిగ్రహంలాగ, ఇండియాకి తాజ్‌మహల్‌లాగ - ఆఫ్రికాకి ఈ బావ్‌బాబ్ చిహ్నం. ఒక పెద్ద బావ్‌బాబ్ చెట్టు మొదలు చుట్టూ గుండ్రంగా రెస్టారెంటుని నిర్మించారిక్కడ. ఈ లాడ్జిపేరు కిల్వా బీచ్ రిసార్టు.

టాంజానియాకి ఎంత స్వాతంత్ర్యం వచ్చినా ప్రముఖమయిన వ్యాపారాలన్నీ ఇంకా తెల్లవారి చేతుల్లోనే ఉన్నాయి. గుజరాత్ నుంచీ వచ్చిన చాలా మంది ఇక్కడ కుదువ వ్యాపారం, రవాణా, టూరిస్టు వ్యాపారాల్లో స్థిరపడారు. ఇప్పటికీ నమ్మకంగా, శ్రద్ధగా, విశ్వాసంతో పని చెయ్యడమే నల్లవాడికి తెలుసు. ఈ బీచ్ రిసార్టుని ఓ జర్మన్ దేశస్థుడు నడుపుతున్నాడు. ఇక్కడ విదేశీయులకు ఆస్తులు

సమకూర్చుకునే హక్కు లేదు. అందుకని ఈ జర్మన్ మొదట ఓ నల్ల పెళ్ళాన్ని సమకూర్చుకున్నాడు. ఇద్దరు పిల్లల్ని కన్నాడు. అతని అత్తగారూ ఇక్కడే ఉంది. మరొక భార్య (జర్మన్ పెళ్ళాం) దార్ ఎస్ సలామ్‌లోనో, జర్మనీలోనో ఉందేమో.

మమ్మల్ని ఆదరంగా పలకరించాడు. శామ్యూల్ అనే నల్లటి వాడు మర్యాదలు చేసి, ఫలహారం ఏర్పాటు చేశాడు. ఇప్పుడు మాతో వచ్చిన గిడియన్ మరో గైడ్‌ని తీసుకొచ్చాడు. గిడియన్‌కి బొత్తిగా ఇంగ్లీష్ రాదు. వచ్చిన ఆ నాలుగు మాటలూ అర్థం కావు. ఈ కొత్త గైడ్ పేరు ఉస్మాన్. ఎటు చూసినా ముస్లిం పేరులు ఎందుకు తటస్థపడుతున్నాయి?

ఈ ప్రశ్నకు సమాధానమే కిల్వా యాత్ర. టాంజానియా వచ్చినవారు ఆ దేశ చరిత్రని తెలుసుకోవాలంటే కిల్వా వచ్చి తీరాలి. నిజానికి కిల్వా మూడు ప్రాంతాల సమ్మేళనం – కిల్వా మసోకో, కిల్వా కిశ్వివానీ. మేమున్నది కిల్వా మసోకో. ఇప్పుడిప్పుడు మెరుగవుతున్న చిన్న పట్టణం అనవచ్చు. అసలు చరిత్ర అంతా ఇక్కడి నుంచీ పది నిముషాలు సముద్రం back waters లో ప్రయాణం చేస్తే చేరే ద్వీపానిది. దాని పేరు కిశ్వివానీ. దీనికి 1200 సంవత్సరాల చరిత్ర ఉంది. ఈ చరిత్రలోనే ఈ దేశం చరిత్ర ముడిపడి ఉంది. 9వ శతాబ్దంలో ఓ శ్వాహిలీ ధనవంతుడు ఈ ద్వీపాన్ని ఆలీ బిన్ ఆల్ హసన్ అనే ఆయనకి అమ్మాడు. హసన్ గారు ఇక్కడ తూర్పు ఆఫ్రికాలో కల్లా ఆనాటి పెద్ద మసీదుని నిర్మించారు. ఇది అప్పట్లో పెద్ద ఓడరేవు. పదిహేనవ శతాబ్దం వరకూ ఈ రేవు ఒక వెలుగు వెలిగింది. 1331లో అబూ అబ్దుల్లా ఇబిన్ బుతాతా అనే మొరాకో యాత్రికుడు దోని గొప్పతనాన్ని ప్రపంచానికి తెలియజెప్పాడు. అతను రాసిన చరిత్రే ఇప్పటికీ సాధికారికంగా మిగిలింది. మరో 170 సంవత్సరాలకి పోర్చుగీసువారు దిగారు.

అంతవరకూ ముస్లిం సుల్తానుల ప్రాబల్యంతో ఆ సంస్కృతి, మసీదులూ, భాషా, పేర్లు అన్నీ దిగుమతి అయి ఇప్పటికీ నిలదొక్కుకుని ఉన్నాయి. ఉస్మాన్‌లూ, సైజీలూ, దార్ ఎస్ సలామ్‌లూ ఇక్కడి జన జీవన భాగం అయిపోయారు.

ఈ కిల్వా కిశ్వివానీ ఒకప్పుడు టాంజానియాకి గల్లాపెట్టె. బంగారు భాండాగారం. ఇక్కడినుంచే బంగారం, వజ్రాలు, కొబ్బరి, దంతాలు, రాగి, సీసం, సుగంధ ద్రవ్యాలు – అన్నిటి కన్నా ముఖ్యం – బానిసలు – గోవా, గుజరాత్, మల్సియా, ఇండోనేషియా, చైనా, ఇరాక్ వంటి ప్రాంతాలకు ఎగుమతి అయేవి. ఖడ్గమృగం కొమ్ములు, కలప సౌదీ అరేబియా ఆ రోజుల్లో దిగుమతి చేసుకున్న ముడిసరుకులు. జింబాబ్వే గనుల్లోంచి రాగి, సీసం వచ్చేది. ఆయా దేశాల నుంచి పోర్సిలిన్, బట్టలు, గాజు వంటివి దిగుమతి చేసుకునే వారు. ఆనాటి నాణాలు దార్ ఎస్ సలామ్‌లోని జాతీయ ప్రదర్శనశాలలో ఇప్పటికీ ఉన్నాయి.

అప్పట్లో తవ్విన నూతిని ఇప్పటికీ ఇక్కడివారు వాడుకుంటున్నారు. శతాబ్దాలుగా ఉప్పునీటి సముద్రం పక్కనే మంచి నీటిని ఇచ్చే 'సెల'ని పట్టుకున్న ఘనత కొన్ని శతాబ్దాల నాటిదని ఆలోచిస్తేనే ఆశ్చర్యం కలుగుతుంది.

ఆ రోజుల్లోనే హసన్‌గారు ఇక్కడ కోటని నిర్మించారు. ఆనాడు ఇండియాకీ, కిల్వానికీ సంబంధ బాంధవ్యాలు ఉండేవనడానికి ఇక్కడి కోటే నిదర్శనం. కోట బురుజు, గోడల చివర బాణాల వంటి నగిషీ – ఏ చంద్రగిరినో, ఉదయగిరినో తలపిస్తాయి. ముఖద్వారానికి భారతీయ కళారూపంలో చెక్కమీద నగషీలున్నాయి. అంతేకాదు. కోటలో ప్రవేశించడానికి – ఆరు రోజుల్లో ఏనుగులచేత తలుపులు బద్దలు కొట్టించే వారు. ఏనుగు కుంభస్థలానికున్న బలం సాటిలేనిది. ఈ ఒడుపు తెలిసిన ఆనాటి శిల్పులు – ముఖద్వారానికి ఇనుప బల్లెపు మొనల్ని అమర్చారు. ఇవి – మన దేశంలోనూ చాలా ముఖద్వారాలలో కనిపిస్తాయి.





ఈ దేశానికి అరాచకం దాదాపు 1498లో ప్రారంభమయింది. ఒకాయన ఇండియాను వెదుక్కుంటూ పోర్చుగల్ నుంచీ బయలుదేరి కిల్వాకిశ్వివానీ దగ్గర లంగరు వేశాడు. ఆయన దిగిన స్థలాన్ని ఇప్పటికీ గైడ్ చూపించగలడు. ఆ మహానుభావుడి పేరు వాస్కోడిగామా. ఇండియాలో తరగని నిధులున్నాయని, ఆ నిధులతో ప్రమేయం లేని నిర్మలమయిన జీవనాన్ని సాగించే ప్రజావాహిని ఉన్నదని వీరంతా విన్నారు. అప్పటికే ఇచ్చిపుచ్చుకోవడాలు ఈ దేశాలకు అవసరం. ఆ యావే లేకుండా సంతృప్తిగా ఉన్న దేశం భారతదేశం. అది అప్పటి మన వైభవం. అప్పటి మన అవసరాలు తక్కువ, వనరులు ఎక్కువ, కనుకనే విదేశీయులకి ఈ దేశం మీద కన్ను. దురదృష్టం ఇవాళ మనమూ పరభాగ్యోపజీవులం అయిపోయాం. ఆకర్షణలను పెంచి, మన కవసరంలేని రుచులను ఈ దేశాలు మప్పాయి. ఇప్పటికీ ఈ దేశంలో పొరుగింటిపుల్ల కూర రుచిగానే ఈ తరం భావిస్తోంది. మన సంపద మన అవసరాల 'కుదింపు' అని బోధించే మహానుభావులు శలవు తీసుకున్నారు. ఉన్నవారి మాటలు మన చెవికి ఎక్కవు.

బుకాయింపు, బలం, స్వప్రయోజనం - ఇవే విదేశీ దాడుల మూల సూత్రాలు. వీరికి డబ్బుకి గడ్డికరిచే స్వదేశీయులు తోడయితే దేశం అమ్ముడుపోతోంది. అప్పట్లో ఆల్ మసూదీ అనే ఒక నల్లనయ్య ఇక్కడ ఉండేవాడు. ఆయన ఘనత వహించిన తాగుబోతు. వాస్కోడిగామా అతన్ని చేరదీశాడు. రకరకాల మత్తుపానీయాల్ని తాగించాడు. తాగుబోతుకి డబ్బు అక్కరలేదు. వ్యసనాన్ని పోషిస్తే చాలు. అతని ద్వారా అప్పటికే రవాణాలు జరిగే ఇండియాకి దారిని కనుగొన్నాడు వాస్కోడిగామా. ఆ విధంగా గోవాలో పోర్చుగీసువారు మొదట పాదం మోపారు. అప్పటికి మలింద్ గిరిజన జాతికి చెందిన సుల్తాన్‌ని మచ్చిక చేసుకోవడానికి పోర్చుగీసుగారు ప్రస్తుతం శిధిలంగా ఉన్న కోటని కట్టించారట. ఫ్రానిస్కోడి ఆల్మైదా అనే ఆయన ఈ కోటకి రూపు దిద్దాడు. ముఖద్వారం మీద సుల్తాన్ గారికి ఆనందం కలిగేలాగ "బిస్మిల్లా రెహ్మాన్ రహీం" (అల్లా పేరిట) అని అరబ్ అక్షరాలు రాయించాడు. వేలాది సంవత్సరాలు సముద్ర గర్భంలో కోరల్స్ (ఒకరకమయిన సముద్ర జీవులు. మనకి ఎముకలు శరీరంలో ఉంటాయి. వాటికి బయట ఉంటాయి. exo - skeleton) అవే కోరల్స్. వాటి అవశేషాలతో ఉన్న శిలలు ఇక్కడ వేలకు వేలున్నాయి. వాటితో ఈ కోటని నిర్మించారు. ఇక్కడ మలింది జాతుల స్మశాన వాటిక ఉంది. అందులో రాజులు, సంపన్నుల సమాధుల మీద గోపురాలున్నాయి. అవి భారతీయ సంప్రదాయాన్ని గుర్తు చేస్తాయి.

బలం, డబ్బు ఉంది కనుక - ఇక్కడి అరబ్ రాజుని లొంగ దీసి - పోర్చుగీసువారికి కప్పం కట్టాలని ఆజ్ఞని ఇచ్చాడు వాస్కోడిగామా! ఎందుకు? కేవలం బలం కారణం. కొన్నేళ్ళు ఇబ్రహీం అమీన్ అనే సుల్తాన్ కట్టాడు. కప్పంతో పాటు కావలసిన వస్తువులు దోచుకుపోయేవారు పోర్చుగీసువారు. తర్వాత మూడేళ్ళు కప్పం కట్టలేదు సుల్తాను. 150 మంది సైనికులతో ఫ్రానిస్కో డి ఆల్మైదా వచ్చి లంగరు వేశాడు. తనని చూడడానికి రమ్మని సుల్తానుకి తాఖీదు పంపాడు. సుల్తాను రాలేదు. 2 రోజులు కిశ్వివానీ మీద బాంబులు పేలాయి. సుల్తాను పరారీ అయాడు. పోర్చుగీసువారు ద్వీపాన్ని చేజిక్కించుకొని మహ్మద్ ఆంఖోన్ అనే ఆయన్ని సుల్తాన్‌ని చేశారు. ఈ కాలంలోనే మరొక మతం ఈ దేశానికి దిగుమతి అయింది. క్రైస్తవ మతం. ఆ విధంగా ముర్రారులు, మధేములు కెన్నెడీలు,



జోసెఫ్‌లు, బెనెడిక్ట్‌లు అయారు. ఈ వివరాలన్నీ అప్పుడు ఇక్కడ ఉన్న జర్మనీ దేశస్తుడు హాన్స్ మేయర్ తన డైరీలో రాసుకున్నాడు. జర్మన్ దేశస్తుడు ఇక్కడికెలా వచ్చాడు? వస్తాడు బాబూ వస్తాడు! చచ్చిన కళేబరాన్ని పీక్కు తినడానికి రకరకాలయిన జంతువులు వస్తాయి.వాటి అడ్రసులు అడగాల్సిన పని లేదు. 19 వ శతాబ్దపు ఆఖరి భాగంలో జర్మన్లు ఈ నగరానికి విచ్చేశారు. ఇప్పుడు కిల్వాబీచ్ రిసార్టుని జర్మన్ దేశస్తుడు ఏర్పాటు చేయడానికి లంకె అర్థమయి ఉండాలి.

ఈ కోటకి దూరంగా 15 వ శతాబ్దంలో ఒక స్వాహిలీ వ్యాపారి కట్టుకున్న దివాణం ఉంది. అందులో - ముందు ఆవరణ, బాత్‌రూం ఏర్పాట్లు, గోడలు నున్నగా మెరిసేటట్టు చేసే పనివాడితనం మనకి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. నూతి నుంచీ తోడిన నీళ్ళు సరాసరి బాత్‌రూముల్లోకి ప్రవహించే కాలువల్ని ఆ రోజుల్లోనే ఏర్పాటు చేసుకున్నారు!

పోర్చుగీసువారు దోచుకున్న ఆలీహసన్ బిన్ సులేమాన్ అనే సుల్తాను ఎలాంటివాడు? 1331 ఇబిన్ బతూతా ఇలా పేర్కొన్నాడు: "చాలా వినయ సంపదగల పాలకుడు. పేద సోదరుల సరసన కూర్చుని భోజనం చేసేవాడు. మతాన్ని, ముస్లిం సంప్రదాయాన్ని శిరస్సున ధరించేవాడు" చీమలు పెట్టిన పుట్టలు పాముల నివాసానికి ఆలవాలమవుతాయన్నది సామెత కదా!

ఫ్రెంచివారికి ఈ సుల్తాన్ బానిసల్ని పంపేవాడు. అందుకు ప్రతిక్రియగా ఫ్రెంచివారు ఈయనకి కోటని కట్టించి ఇచ్చారు. ఆ కోటగోడల్లో ఎక్కడో మర్రి విత్తనాన్ని ఏ పక్షో జార్చిఉంటుంది. అది పెరిగి ఆకాశం ఎత్తున లేచి పెద్ద వృక్షమయింది. కిందనున్న కోట భూమిలోకి కృంగిపోయింది. ఊడలు సాచిన మర్రి ఇప్పటికీ ఉంది - చరిత్ర వర్తమానం ముందు ఎంత మరుగుజ్జులాగ కనిపిస్తుందో నిరూపించే 'వాస్తవం'లాగ!

కోట ముందు ప్రవహించే సముద్రపు నీటిపాయకి ఆవలి ఒడ్డున గొడుగు పట్టినట్టు సముద్రపు తుప్పలు (మాన్‌గ్రోవ్) అత్యంత మనోహరంగా కనిపిస్తాయి. ప్రపంచంలో ఉప్పు నీటిని పీల్చుకుని అందులోంచి ప్రాణవాయువుని రాబట్టే సహజమయిన desalination ప్రక్రియ ఈ చెట్లకి మాత్రమే ఉంది. మరే చెట్లూ ఉప్పు నీటిలో బ్రతకవు.

పచ్చగా నిగనిగా మెరిసే ఈ చెట్లు ప్రాణకోటి ఎంతటి విపరీతమయిన పరిస్థితులలోనయినా ఎలా నిలద్రొక్కుకోగలదో నిరూపించే చక్కటి ఉదాహరణ. చేపలు వాటి వేళ్ళలో గుడ్లు పెడతాయి. నీటికాకులు (సీగల్స్) వాటిని ఏరుకు తింటాయి. ఈ చెట్ల నిండా నీటికాకుల గుంపులు. ఏ మేధావి ఈ eco – system ని కనుగున్నాడో! ఈ దృశ్యాలను పరికిస్తే నాస్తికుడికి కూడా ఒక్కసారి భగవంతుడనే అద్భుతమయిన శక్తి ఉన్నదని అనిపించక మానదు.

## 8

**తూర్పు** ఆఫ్రికాలో దాదాపు నూట ఇరవై గిరిజన జాతులున్నాయి. నిజానికి ఏడో శతాబ్దంలో మధ్యధరా సంస్కృతినుంచీ (ఈజిప్టు) ఒక ముఖ్యమయిన జాతి వచ్చి చేరింది. ఆ జాతి పేరు మసాయి. వీరు కీన్యా వచ్చి రుదోల్ఫ్ సరస్సు సమీపంలో స్థిరపడ్డారు. వీళ్ళలో ఇద్దరు వీరులు - లెనానా, సెంధియా. వీళ్ళది వీరుల జాతి. తమ తండ్రి పాలక అధికారం కోసం వీరు పోరాడారు. సెంధియా ఓడిపోయాడు. అప్పటి టాంగనీకాకు తన వర్గంతో వలసపోయాడు. వీళ్ళంతా అరూషా, గొరొంగోరో, మోండులీ, కితేతో ప్రాంతలలో స్థావరాలు ఏర్పరచుకున్నారు. ఈ ప్రాంతాన్నంతటినీ "మసాయ్ మారా" అంటారు. వీళ్ళకి తమ స్థావరాలున్నాయి. నాయకులున్నారు. తమ పరివారముంది.

వీరు. గోపాలురు. గోవుల్ని కాసుకోవడం వీరి వృత్తి. నల్లనివారు, పద్మనయనమ్ములవారు, ఆజానుబాహులు. పిల్లని పెళ్ళిచేసుకోవాలంటే వయసొచ్చాక తన బల్లెంతో సింహాన్ని చంపగలగాలి. సింహబలులు. ఇప్పటికీ సింహం అడవిలో ఒక్క మసాయి

వాసన తగిలితేనే పారిపోతుంది. మన కావ్యకారులు సింహస్వప్నం అంటారు. కానీ సింహాలకి మసాయి స్వప్నం. వీరు మెడనిండా రకరకాల అలంకారాలు పెట్టుకుంటారు. శిరస్సుకి అలంకారం ఉంటుంది. చేతులకి పూసల అలంకారాలు, కాలికి కంకణాలు (వక్షస్థలే కౌస్తుభం, నాసాగ్రే నవ మౌక్తికం, కరే కంకణం - జ్ఞాపకం వస్తోందా!)

వీరిలో సంపన్నులు పది మంది భార్యలను పెళ్ళాడతారు. అందరినీ ఒకేచోట ఉంచి - అందరికీ తలో ఇల్లూ నిర్మించి కాపురం చేస్తారు. పెళ్ళయిన ప్రతి ఆడా మగకీ కాళ్ళకి పట్టీలు విధిగా ఉంటాయి. వీళ్ళలో అందరూ కాకపోయినా - కొందరయినా వేణువు వాయిస్తారు.

ఇంతవరకూ చెప్పాక - ఇప్పుడు భౌగోళికమయిన సత్యాన్ని ఉట్టంకిస్తాను. అంటార్కిటాను అంటుకుని గొండ్వానా పీఠభూమి ఒక్కటే ఉండేది. కొన్ని కోట్ల సంవత్సరాల ముందు (భౌగోళిక కాలమానానికి లక్షల సంవత్సరాలు చాలా సామాన్యమయిన కొలబద్ద) క్రమంగా - ఈ భూమి విడిపోయి ఖండాలుగా దూరమయిపోయింది. అందుకనే పెద్దలు వీటిని ఖండాలనే అన్నారు - ఆసియా ఖండం, ఆఫ్రికా ఖండం - ఇలాగ. మరికొన్ని లక్షల సంవత్సరాలకి తూర్పు ఆఫ్రికాకు అంటిపెట్టుకుని ఉన్న ఖండం వేరయి, వచ్చి వచ్చి ఆసియా ఖండాన్ని నొక్కుతోంది. కనుక హిమాలయాలు సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ పెరుగుతున్నాయి! ఇది ఒక జీవితకాలంలో గుర్తుపట్టగలిగే పరిణామం కాదు. ఊకదంపు కథ అంతకన్నా కాదు. భూమిలో ఉన్న ఖనిజపు అణువులు అయస్కాంత శక్తి ప్రసరించే వేపు కిరణాలను వ్యాపింపచేస్తాయి. సంవత్సరాలు గడిచి శిలలలో అవి అలాగే కరుడుగట్టిపోతాయి. తూర్పు ఆఫ్రికా శిలలలో కోణాల తీరు, పశ్చిమ భారత దేశపు శిలలలో కోణాల దిశ ఒక్కలాగే ఉన్నాయని శాస్త్రజ్ఞులు తేల్చారు. విరిగిన రొట్టెని దగ్గరకి చేరిస్తే ఏ పగులు దగ్గర ఆ ముక్క అతికినట్టు కూర్చుంటుంది. మరి తూర్పు ఆఫ్రికాలో 'మసాయి' తెగ ఉంది. పశ్చిమ భారత దేశంలో 'యాదవు'లున్నారు. ద్వారక ఉంది. అక్కడా నల్లనివారు, పద్మనయనమ్ములవారున్నారు. కొన్ని కోట్ల సంవత్సరాల క్రితం భౌగోళిక సామ్యాన్ని ఊహించగలిగితే ఈ రెండు జాతులకీ సాపత్యం ఉందా! ఇది ఆంత్రోపాలజిస్టుల పరిశోధన చేసి తేల్చ వలసిన విషయం. ఈ మీమాంస స్వకపోల కల్పితం కాదు. ప్రసాదరావుగారిది.

ఇక్కడ హెరాల్డ్ సోరెన్సన్ అనే శాస్త్రజ్ఞుడి మాటని చెప్పి తీరాలి. ఆయన మాటలు: "ఒక సామ్యం కలిస్తే దాన్ని కేవలం సంఘటన అంటాం. రెండు సామ్యాలు కలిస్తే అది కాకతాళీయం అంటాం. కానీ రెండు కంటే ఎక్కువ కలిస్తే? అది సంబంధం అనక తప్పదు." ఈ విషయంలో ఆ సంబంధం (pattern) వర్తిస్తుందేమో!

మరి ఈజిప్టునుంచీ వచ్చిన ఈ తెగకి చాలా దగ్గరలోనే జీసస్ అవతరణ. ఆలోచించిన కొద్దీ భౌగోళికంగా మానవాళి చరిత్రకి ఎంత దగ్గర సంబధాలున్నాయో ఊహించిన కొద్దీ ఆశ్చర్యమూ, అంతకు మించి ఆనందమూ కలుగుతుంది. మధ్యధరా సంస్కృతికి తూర్పున ఉన్న 32 దేశాలలో రామాయణం ఉన్నదని చల్లా రాధాకృష్ణ శర్మగారు చెప్పిన గుర్తు. ఇది "వసుధైక కుటుంబకం" అన్న ఆలోచనకు భూమి చరిత్ర ఇచ్చే ఊతం!

మసాయివారు నివసించే ప్రాంతాన్ని 'బొమా' అంటారు. మేం అరూషాకి 95 కిలోమీటర్ల దూరంలో ఉన్న లొంగిడో అనే ఊరుకి వెళ్ళాం. అక్కడికి రెండు ఫర్లాంగుల దూరంలో ఒక మసాయి నివాసం ఉంది. ఈ ఊరులోనే మసాయి జాతి పునరుద్దరణకు ప్రభుత్వమే ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. మాలాంటి యాత్రికులు చాలా మంది వస్తారనుకుంటాను. మాతో ఇంగ్లీషు తెలిసిన మసాయి గైడ్ వచ్చాడు. అతని పేరు యెహోనా. అతని తల్లి చాంగా జాతి స్త్రీ. తండ్రి మసాయి. మసాయి వారు దేశ భాష కిస్వాహిలో మాట్లాడటానికి ఇష్టపడరు. వారికి వేరే భాష ఉంది. దాని పేరు 'మా'. విచిత్రంగా చాలా యూరోపు దేశాలలో వలె కాకుండా ఇక్కడ చాలామంది ఇంగ్లీషు మాట్లాడతారు.

మేం వెళ్ళిన మసాయి నివాసం ఒక సంపన్నుడయిన మసాయిది. ఆయనకి 300 గోవులున్నాయి. 200 మేకలున్నాయి. ఆరుగురు భార్యలున్నారు. పదిహేను మంది సంతానం. అందరికీ ఒకే ఆవరణలో ఇళ్ళు కట్టాడు. అన్నీ రెల్లుతో కట్టిన ఇళ్ళు. (అయితే ఇది పేదరికానికి చిహ్నం కాదు. వారి సంప్రదాయానికి మాత్రమే) ప్రతి ఇంట్లోనూ యజమాని పడుకునే పెద్ద మంచం ఉంటుంది. దానిమీద మెత్తని ఆవు చర్మం పరుస్తారు. మగపిల్లలు ఆయన దగ్గర పడుకుంటారు. మరో చిన్న మంచం మహారాణీగారికి. అంత చిన్న గుడిసెలోనే ఎప్పుడూ నిప్పు రాజుకుంటూంటుంది. మేం లోనికి వచ్చాక నిప్పు మీది నివురు ఊది కిరసనాయిలు దీపం వెలిగించింది - ఆ గుడిసె రాణీ. గుడిసెకి చిన్న కన్నంలోంచి వెలుగు వస్తూంటుంది. అంత చిన్న కన్నం ఎందుకు? వారు బ్రతికేది అడవుల్లో. రాత్రులలో క్రూరమృగాలు తిరుగుతుంటాయి. అందుకని అవి లోనికి జొరబడకుండా రక్షణకి. రాత్రివేళల్లో ఆవుల్నీ, గొర్రెల్నీ మృగాలు ఎత్తుకుపోకుండా ఆవరణ చుట్టూ ముళ్ళకంచెలు వేశారు.

పదహారు ఏళ్ళ వయస్సు వచ్చాక ఆడపిల్లకి పెళ్ళి చేస్తారు. ఆడది గర్భం దాల్చగనే ఫలానా వ్యక్తి భర్త కావాలని ముందుగానే నిర్ణయించుకుంటారు. తీరా పుట్టేది మగబిడ్డయితే ఆ వీరుడికి స్నేహితుడవుతాడు. ఆడపిల్లయితే భార్య అవుతుంది. అయితే పెళ్ళికి ముందు సింహాన్ని చంపి మగవాడు తన వీరత్వాన్ని నిరూపించుకోవాలి.

కౌరవ సభలో ద్రౌపదిని దుశ్శాశనుడు అవమానించినప్పుడు భీముడు అతని పచ్చి నెత్తురు తాగుతానని ప్రతిజ్ఞ చేస్తాడు భారత యుద్ధంలో అన్నంత పనీ చేస్తాడు. పీజాలూ, సమోసాలు అలవాటు పడ్డ నేటి తరానికి ఇది చాలా ఆటవికమయిన చర్యగా కనిపించవచ్చు. కానీ అప్పటి కాలమాన పరిస్థితులను, అప్పటి అలవాట్లను మనం గుర్తుంచుకోవాలి. ఇంత చెప్పడానికి కారణం - ఇక్కడి మసాయిలు లేడినీ, చారల గుర్రాన్నీ చంపి పచ్చి రక్తం తాగుతారు.

మేం తిరిగి వస్తుంటే అరూషాలో వ్యాపారం చేసే ఒక మసాయి యువకుడు కనిపించాడు. చక్కని ఇంగ్లీషు మాట్లాడతాడు. అతనికి యూరోపియన్ గర్ల్‌ఫ్రెండ్ ఉంది. ఎలా కలిసింది? ఎలా ప్రేమించావు? అడిగితే సిగ్గుపడి నవ్వేశాడు. అతనికి ఫోన్ నంబరు ఉంది. అంతకు మించి ఈమెయిల్ అడ్రసు ఉంది. తన ఫోటో పంపమని అతనే స్వయంగా వ్రాసి ఇచ్చాడు!

చేతికి వాచీ తప్ప ఏ కోశానా తన సంప్రదాయాన్ని వదులుకోలేదు. కాస్తపాటి విదేశీ ప్రభావానికే పిల్లి గడ్డాలూ, చింపిరి జుత్తులతో తిరిగే మన తరం కుర్రకారుకి ఇంగ్లీషు చదువు, యూరోపియన్ గర్ల్‌ఫ్రెండు ఉన్న ఈ కుర్రాడు అచ్చం నూటికి నూరు పాళ్ళూ 'మసాయి' సంప్రదాయాన్ని పాటించడం ఒక కనువిప్పు - ఒక సందేశం. సంస్కారం మన జీవితాన్ని వెర్రితలలు వేయించనక్కరలేదు. మరొక సంస్కృతి మన వైభవాన్ని తుడిచి పెట్టనక్కరలేదు. మెలూబో కిలూసూ - అదీ అతని పేరు.

వీరికి వైద్యం చుట్టు పక్కల ఉన్న చెట్లూ, చేమలే. వీరు కొండల్ని పూజిస్తారు. (శ్రీకృష్ణుడు, గోవర్ధన పర్వతం ఇతిహాసం మనస్సులో కదులుతోందా?) మరొక ముఖ్యమయిన ఆచారం - వీరు భూమిని దైవంగా భావిస్తారు. దాన్ని చెరిచి (molest చేసి) సాగు చేసి, అనుభవించడం నేరంలాగా భావిస్తారు. భూమి సహజ లక్షణాలని కూడా ధ్వంసం చేసి, సాగు చేసి, ఎరువులతో శాశ్వతంగా భూమిని సర్వనాశనం చేసే నేటి మానవాళి నేర్చుకోవలసిన పాఠం వారి జీవితంలో సంప్రదాయంగా నిలవడం ఎంత గొప్ప విషయం! మరో అద్భుతమయిన సంగతి - ఈ యాదవ కులంలో పుట్టిన - నిజానికి శ్రీకృష్ణునికి ఆగ- ఆడా, మగా అంతా గుండు చేయించుకుంటారు. కారణం - వీరి ప్రధాన సమస్య - నీరు. ఏ వారానికో ఒళ్ళు తుడుచుకుంటారో, అది కూడా చేయరో - తెలీదు. పెరిగే జుత్తు దుమ్ము దూసరవుతుంది. అందుకని వారం వారం చుట్టు పక్కల జరిగే సంతల్లో గుండు చేయించుకుంటారు.

ఇప్పటికీ దాహం వేస్తే ఆవు మెడ మీద ఒక నరానికి రంధ్రం చేసి నెత్తురు తాగి మళ్ళీ మైనంతో విచిత్రంగా మూసేస్తారు. మొదట్లో మాంసం మాత్రమే తినేవారు. ఇప్పుడిప్పుడు జొన్న పిండితో అంబలి, చిన్న చిన్న తినుబండారాలూ అలవాటు చేసుకున్నారు.

వారం వారం సంతకి వెళ్ళి కుటుంబానికి అవసరమయిన వస్తువులు ఖరీదు చేస్తారు. వీరు తాగే మద్యాన్ని మనం ఒక్క గుక్క తాగితే ముఖం తిరిగి పడిపోతాం. అంత ఘాటుగా ఉంటుంది. కిరసనాయిలు, పందికొవ్వు వీరికి ఇంధనాలు. బట్టలు, గోధుమలు, ఎండిన జొన్నలు, రబ్బరు టైర్లతో చేసిన పాదరక్షలు - సమస్తమూ సంతలో దొరుకుతాయి. ముదురు ఎరుపు, నీలం రంగు బట్టలు, ఉత్తరీయాలు ధరిస్తారు. ఈ రంగులకేమయినా ప్రత్యేకత ఉందా? ఏమీ లేదు - ఎన్ని రోజులయినా నల్లబడవు కనుక. పూసల దండలు - నడుముకీ, మెడకీ, చేతులకీ, తలకీ - రంగు రంగుల పూసల దండలు, చిన్న చిన్న ఎముకలతో చేసిన అలంకారాలు ఈ సంతల్లో అమ్ముతారు.

ఈ సంతలో ఒక మూల నుంచీ నగర సంస్కారం తొంగి చూస్తోంది.

ఉపాధి కోసం, జీవిక కోసం కొనుగోలుకి వచ్చిన వీరికి రాబోయే ఎన్నికలలో నాయకుని గురించి ఒక పక్క ఉపన్యాసం సాగుతోంది. సగం అర్థమయీ, కాని ముఖాలతో ఊసుపోనివారు ఉపన్యాసాన్ని వింటున్నారు. మనలాంటి కొత్త మనుష్యుల్ని వీరు వింతగా చూస్తారు. తమని జంతువుల్లాగా ఫోటోలు తియ్యడాన్ని నిరసిస్తారు. నగర జీవనానికి అలవాటు పడ్డ మరికొందరు మసాయి ఫోటోకి నిలిచినందుకు డబ్బు ఆశిస్తారు.

లొంగిడో యజమాని ఒక భార్యని తీసుకుని ఆవుని అమ్మడానికి దగ్గర్లో ఉన్న సంతకి వెళ్ళాడు. మమ్మల్ని చూసి మిగతా పరివారం తాము చేతిపని చేసిన పూసల హారాల్ని మాముందు పరిచారు అమ్మకానికి. రకరకాల అలంకారాలున్నాయి. ధరలు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయి - రెండు నుంచి ఎనిమిది డాలర్లు. మాకు నవ్వొచ్చింది. ఏ వస్తువూ తీసుకోకుండానే పది డాలర్లు వాళ్ళకిచ్చి కారు ఎక్కాం.

✡✡✡✡✡✡

టాంజానియాలో చాలా గొప్ప నేషనల్ పార్కులకి కూడలి అరూషా. దార్ ఎస్ సలాం నుంచీ చిన్న విమానంలో గంట ప్రయాణం - కిలిమంజారో విమానాశ్రయానికి. ఈ పేరు చాలా మందికి ఆలోచనల్ని రేపి ఉంటుంది. కిలిమంజారో తూర్పు ఆఫ్రికాలో ఒకప్పుడు రగిలిన అగ్ని పర్వతం. మూపుని నరికిన ఎద్దులాగా తెల్లటి మేఘాల వెనక కనిపిస్తూంటుంది. ముఖ్యంగా విమానం కిలిమంజారో విమానాశ్రయంలో దిగబోయే ముందు తెల్లటి మేఘాల్లోంచి దూసుకు వచ్చినట్టు కనిపించే పర్వత దృశ్యం అపూర్వం. పర్వతం మీద గడ్డ కట్టిన తెల్లటి మంచు చారలు పరుచుకుని ఉంటాయి. కిలిమంజారోని ఆఫ్రికా తలమానికం (roof top of Africa) అని పిలుస్తారు. దీన్ని తలదన్నే పర్వతం ఒకప్పుడు -బహుశా కొన్ని లక్షల సంవత్సరాల కిందట - గొరొంగోరో. అదిప్పుడు కూలిన కారణంగా - కిలిమంజారో ఆఫ్రికాలో ఆముదం చెట్టులాంటిది. ఎయిర్‌పోర్ట్‌కి 40 కిలోమీటర్ల దూరంలో అరూషా. అరూషాకి గంట గంటన్నర దూరంలో ఆరు పార్కులున్నాయి - అరూషా నేషనల్ పార్కు, మన్యారా, గొరొంగోరో, సెరెంగిటీ, తరంగిరె, కిలిమంజారో. వీటిని చూస్తే టాంజానియాలో ఉన్న జీవన సంపదనంతా తిలకించినట్టే.

అరూషాకి రెండు గంటల దూరంలో మన్యారా అనే మంచినీటి సరస్సు ఉంది. నీరు ఉన్న చోట వృక్ష సంపద, ప్రాణి కోటి ఉంటుంది. సెరెంగిటీ, గొరొంగోరో వెళ్ళే యాత్రికులకు మన్యారా ఒక మజిలీ. విష్ణుమూర్తి దర్శనానికి ముందు జయవిజయుల్ని పలకరించడం లాంటిది తరంగిరె, మన్యారా. అయితే మేం గిరీశం చెప్పినట్టు అటునుంచీ నరుక్కు వచ్చాం.

సెరెంగిటీలో జంతుజాలం ఈ సమయంలో నీటిని వెదుక్కుంటూ కీన్యాకు వలసపోతాయి. మాతో మన్యారా ఫిగ్ లాడ్జిలో డేరా వేసుకుని బస చేసిన హాలెండు జంట - సెరెంగిటీ (కీన్యావేపు ఉన్న భాగం)లో ఆరు రాత్రులు గడిపి 30 పైగా సింహాలని చూశారట. పందిని చంపినవాడే బంటు అన్నట్టుగా - ఈ అరణ్యాలలో సింహాన్ని చూస్తే అన్నీ చూసినట్టే. ప్రపంచంలో గిర్ (గుజరాత్, ఇండియా) సింహాల కంటే ఆఫ్రికన్ సింహాలు పెద్దవి, గంభీరమైనవి.

మన్యారా పార్కులో అన్నీ ఉన్నాయి - సింహాలు తప్ప. కాకులు దూరని ఈ కారడవుల్లో సింహాలు వేటాడి కబళించడానికి వీలుగా విశాలమయిన బయళ్ళూ లేవు - మిగతా జంతువులకి సింహాలు వెంటాడుతాయనే భయమూ ఉన్నట్టు లేదు. సింహం 70 మైళ్ళ వేగంతో కేవలం 40 సెకన్లు మాత్రమే పరిగెత్తకలదు. ఆ తర్వాత దాని ఉధ్ధృతి తగ్గిపోతుంది. అయితే ఆ వేగాన్ని ఎప్పుడు ఎలా పుంజుకుని తన వేటని సాగించాలన్నది సింహానికి జన్మతః వచ్చిన విద్య. ఈ వేట చూడడానికి వినోదంగా ఉండవచ్చుగానీ - వేటాడే జంతువుకి అది ఉపాధి. బలి అయే జంతువుకి అది ప్రాణ సంకటం. అయితే అదే సృష్టిలీల! మళ్ళీ 'చినచేపను పెద చేప' జ్ఞాపకం వస్తుంది.

మన్యారాలోనూ మా కోరిక తీరలేదు. ఈ పార్కులను ప్రచారం చేసే సంచికలో - తాము వెళుతున్న జీపు కింద రెండు సింహాలు పడుకున్న దృశ్యాన్ని చూశాను. వారు ఎంత అదృష్టవంతులు! ఎంత చిరస్మరణీయమయిన దృశ్యం అది! అనుకుంటూ - ప్రపంచంలోకల్లా ఎనిమిదో అద్భుతంగా కొనియాడబడే గొరొంగోరో సందర్శనానికి వాన్ ఎక్కాం.

## 9




**గొరొంగోరో** ప్రపంచ అద్భుతాల్లో ఎనిమిదవది అంటారు. వివరాలు తెలుసుకుని, ఒక్కసారి అక్కడికి వెళితే - ఆ మాట నమ్మడానికి మనకే అభ్యంతరమూ ఉండదు. నిజానికి మిగతా ఏడూ ఇంత అద్భుతంగా ఉన్నాయ! అని ఆశ్చర్యపడాలనిపిస్తుంది నాలాంటి వాడికి.

20 లక్షల సంవత్సరాల కిందట ఆఫ్రికాలో కల్లా ఎత్తయిన అగ్నిపర్వతం గొరొంగోరో. దాని చుట్టుకొలత ద్దాపు 260 మైళ్ళు. వ్యాసం పన్నెండు మైళ్ళు. ఒకప్పుడు ఆ అగ్నిపర్వతం బ్రద్దలయింది. లావా ఆకాశంలో పదిమైళ్ళ ఎత్తుకి చిమ్మిందట. పదిమైళ్ళు అంటే 'అయొనోస్ఫియర్' లోనికి దూసుకు వెళ్ళిందన్నమాట. లావా బూడిద చుట్టుపక్కల లక్షా ఎనభైవేల మైళ్ళ ప్రాంతానికి వ్యాపించింది. అదీ సెరెంగిటీ. మెత్తగా పరచిన ధూళితో నిండిన, ఏ మొక్కా పెరగని బల్లపరుపు నేల అది. కొన్నివేల జంతువులు - కాదు - లక్షల జంతువులు ఆ స్థలంలో పుడుతున్నాయి, పెరుగుతున్నాయి, నశిస్తున్నాయి.

లావా చిమ్మగా డొల్ల అయిన పర్వతంపై భాగం మెల్లగా కూలిపోయింది. ఇలా లావా చిమ్మిన కొండలో పల్లాన్ని క్రేటర్ అంటారు. కానీ ఇది అలా కాదు. 260 మైళ్ళు చట్రంలాగా నిలిచి - మధ్య భాగమంతా కూలిపోయింది. ఇది భౌగోళికంగా ఏర్పడిన పే...ద్ద పళ్ళెం. దీన్ని 'కల్‌డెరా' అంటారు. ఈ పళ్ళెం చుట్టూ 2000 అడగుల ఎత్తున కోసినట్టున్న కొండలు. ఎవరూ పాకినా ఎక్క గలిగే అవకాశం లేదు. సంవత్సరాలు గడుస్తుంటే వర్షాలు పడి - ఇక్కడ నీటి సరస్సులు ఏర్పడ్డాయి. చెట్లు మొలిచాయి. జంతువులు పుట్టాయి. పుట్టిన జంతువులు ఎక్కడికీ పోలేవు. ఈ పళ్ళెంలో దాదాపు 26,000 జంతువులున్నాయి. వెయ్యి రకాలయిన పక్షులున్నాయి. అవన్నీ అక్కడే పుట్టి పెరిగి, కొన్ని జంతువులకి ఎర అయి - మిగతావి జీవిస్తున్నాయి. ఈ జీవన వైవిధ్యం అపూర్వం. ఇన్ని సంవత్సరాలలో వీటన్నిటికి తగినంత నీరు లేకపోయినా, ఆహారం లేక పోయినా ఈ ప్రాణకోటి నశించేది. అదృష్టవశాత్తూ మానవుడు ఇక్కడ జోక్యం చేసుకోలేదు. సృష్టిలో నిక్షిప్తమయివున్న food cycle, life cycle - అన్నీ తూకంగా కొనసాగుతున్నాయి. ఇది అపూర్వమయిన eco-system. ఇక్కడ సింహాలున్నాయి, చిరుతపులులున్నాయి, ఏనుగులున్నాయి, చారల గుర్రాలున్నాయి, అడివి దున్నలున్నాయి, లేళ్ళున్నాయి, దుప్పలున్నాయి,

పక్షులున్నాయి, పాములున్నాయి, కొండ చెలువలున్నాయి - మీ ఇష్టం. ఆకలి వేస్తే కడుపు నింపుకోడం తప్ప - అనవసరంగా జీవకోటిని కబళించే శక్తులు లేని కారణంగా ఈ జీవన వైవిధ్యం (bio-diversity) కొన్ని లక్షల సంవత్సరాలుగా నిరంతరాయంగా సాగుతోంది. దీనిని ఐక్యరాజ్య సమితి పరిరక్షక స్థలంగా ప్రకటించింది. దీని పరిరక్షణకు చాలా దేశాలు ఉదారంగా నిధులు సమకూరుస్తాయి.

యాత్రికులు వాన్‌లలో ఈ పళ్ళెం అంచుగుండా దిగుతారు. ఎవరూ వాన్‌లోంచి బయటికి రాకూడదు. అవి మృగ ప్రాణుల ప్రపంచం. వాటి ప్రపంచంలోకి మనం అడుగు పెడుతున్నాం.

ఆఫ్రికా ఏనుగుల గురించి ఇక్కడ కొంత చెప్పాలి. ఏనుగు, నలుగురు గుడ్డివాళ్ళ కథ ఆఫ్రికా ఏనుగుకి వర్తించదు. ఇక్కడి ఏనుగుల చెవులు 30 చేటలంత వెడల్పుగా, పెద్దవిగా ఉంటాయి. అంత పెద్ద చెవులు నేనెక్కడా చూడలేదు. దంతాలు కూడా పెద్దవి. మన దేశపు ఏనుగుల కంటే వీటి మెదడు చిన్నది. అందుకనే వీటిని అదుపులో పెట్టడం, జన జీవనంలోకి వీటిని తీసుకురావడం దుస్సాహం. మనదేశంలో సర్కసుల్లోనూ, దేవాలయంల్లోనూ, అప్పుడప్పుడు రోడ్ల మీదా మావటీళ్ళు ఏనుగుల్ని నడిపిస్తారు. ఆఫ్రికా ఏనుగుల్ని ఎవరూ అలా నడిపించలేరు. అవి నడవాలి - అంతే. కారణం - వాటిని అదుపులో పెట్టడం అసాధ్యం. అందుకనే - మనకి సైనిక దళాలలో పదాతి, తురగ దళాలతో పాటు గజ దళాలున్నాయి. రాజులు ఏనుగు మీద అంబారీ కట్టి ఊరేగుతారు. ఒక సినిమాలో నేనూ మహరాజు వేషంలో ఏనుగు మీద ఊరేగాను. మహాకవులకు గజారోహణం గొప్ప సత్కారం. నిజానికి గజారోహణ ఒక యోగం అంటారు. అలాంటి ప్రయత్నాలు ఆఫ్రికా ఏనుగుల విషయంలో ఎవరూ సాహసించరు. సకుటుంబంగా తిరిగే ఏనుగు ఒక్కటే అడివిలో ప్రతీ జంతువూ భయపడే ప్రాణి. మరొక ప్రమాదకరమయిన జంతువు అడవి దున్న. ఈ రెండూ ఎప్పుడు తిరగబడతాయో, తిరగబడితే ఏం జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. ఈ రెండూ శాఖాహారులే అని మనం గుర్తుంచుకొంటే - నాలాంటి శాఖాహారికి మరింత గర్వకారణంగా ఉంటుంది.

గొరొంగోరో పళ్ళెంలోకి వాన్ దిగుతుంటేనే మనకి సంభ్రమాశ్చర్యాలు కలుగుతాయి. ఆ సహజ సౌందర్యాన్ని (virgin forest) చూస్తుంటే శరీరం గగుర్పొడుస్తుంది. ఎక్కడ చూసినా సెవన్నా రెల్లు. అక్కడ ఇప్పుడు కనిపించే చెట్లన్నీ ఈ లక్షలాది సంవత్సరాలలో నిలదొక్కుకున్నవే.

ఇంకా గొరొంగోరో ప్రవేశిస్తుండగానే అల్లంత దూరంలో చిరుతపులి సేద దీర్చుకుంటూ కనిపించింది. బైనాక్యులర్స్‌లో ముఖం మీద రెండు చారలు స్పష్టంగా తెలుస్తున్నాయి. అప్పుడప్పుడు గాలిలో ఎగరేసే తోక - ఆ శరీరం ఎంత బలమైనదో చెపుతోంది. పులి అక్కడినుంచీ లేవలేదు. పూర్తిగా పులి స్వరూపాన్ని చూసే అవకాశం లేదు. ముందుకి సాగిపోయాం చెట్లని వెదుక్కుంటూ. ఎందుకంటే చిరుత ఒక్కటే చెట్టు ఎక్కి విశ్రమించగలదు.



మరో అరగంటలో - మరుపురాని - టాంజానియా యాత్రలో తలమానికం అనదగ్గ గొప్ప సన్నివేశం ఎదురయింది. అప్పటికే నాలుగయిదు యాత్రికుల వాన్‌లు అక్కడ గుమికూడి ఉన్నాయి. ఎక్కడయినా యాత్రికుల వాన్ ఆగితే - అక్కడేదో దృశ్యం ఉన్నదని గుర్తు. మరి ఇక్కడ?

అంతకు ముందు - కేవలం అరగంట ముందు - కొన్ని కొదమ సింహాలు (ఇంకా వయస్సు ముదరనివి) వ్యాహాళికి వచ్చి - ఒక చోట గుర్రాన్ని వేటాడాయి. దాదాపు 150 కేజీల ఆహారమది. మర్డర్ జరిగిన చోట - జరిగాక - హంతకులు ఎలా తచ్చాడుతుంటారు? పసి సింహాలు (ఇలా అంటున్నప్పుడు బొత్తిగా చిన్నవని భావించనక్కరలేదు - ఫొటోలు చూడండి) అలా హడావుడి పడుతున్నాయి. తినే యావ ఉన్నవి తిని వస్తున్నాయి. ఎన్ని? 8 సింహాలు!

మాకు కళ్ళు తిరిగిపోయాయి. కేవలం 20 గజాల దూరంలో చచ్చిపడివున్న చారల గుర్రం - అటూ ఇటూ పరుగులు తీస్తున్న కుర్ర సింహాలూ - రెల్లులోంచి వస్తున్న మరికొన్ని - అన్నిటి మూతులకీ పచ్చి రక్తం.




ఎండ కణకణలాడుతోంది. రెండు సింహాలు సుష్టుగా భోజనం చేసి - ఉన్నట్టుండి మా వాన్ నీడలోకి వచ్చి పడుకున్నాయి. మాకు ఎక్కడలేని ఆవేశం, ఆనందం, చెయ్యి జాపితే తగిలే దూరంలో సింహాలు. వెంటనే మరి రెండు - మరొకటి - ఇలా 8 చేరాయి. ఎటు చూసినా సింహాలు - మా వాన్ కింద - మాకు కనిపిస్తున్నాయి. కానీ ఫోటోలో పట్టుకోడం ఎలా. నాకు ఆతృత పెరుగుతోంది. చుట్టూ చూశాను. దూరంగా ఒకే అమ్మాయి ఉన్న వాన్ కనిపించింది. ఆమెకి మా ఆవేశం అర్ధమవుతోంది. నవ్వుతూ - కాస్తపాటి ఈర్ష్యతో మమ్మల్ని గమనిస్తోంది. "ఫోటో తీస్తావా?" అని కెమేరా చూపించాను. చాలా ధైర్యంగల పిల్ల. వాన్‌లోంచి చెయ్యి జాపితే కెమేరా అందే దూరానికి వచ్చింది. సింహం ఒక్కసారి తలయెత్తితే - దాని ఊపిరి మా చేతులకి తగులుతుంది. కాలు విదిలిస్తే మా చెయ్యి విరిగిపడుతుంది. మా వాన్‌లోంచి ఆమెకి కెమేరా అందించాను. దూరంగా వెళ్ళి ఫొటోలు తీసింది. అప్పటికే కొన్ని సింహాలు కదులుతున్నాయి. దురదృష్టం. చిప్‌లో మరో మూడు ఫోటోలకే అవకాశం ఉంది. మళ్ళీ దగ్గరికి వచ్చి కెమేరా అందించింది. రహస్యంగా కృతజ్ఞత చెపుతూ పేరడిగాను. సోఫియా. జర్మన్ కావచ్చు, ఇటలీ దేశస్థురాలు కావచ్చు. మా టాంజానియా యాత్రలో మకుటంగా నిలిచే ఫోటోలు ఆ మూడూ. (అయితే వాటిని తలదన్నే దృశ్యాలను చూస్తామని అప్పటికి తెలీదు!)

సింహాల కథని మాటల్లో పెడితే - అమ్మా నాన్నకి చెప్పకుండా విశృంఖలంగా తిరగడానికి వచ్చిన 8 మంది కుర్రాళ్ళు - తేలిగ్గా ఓ చారల గుర్రాన్ని వేటాడారు. అది వాళ్ళ ఘన విజయం. ఆ ఉత్తేజం, ఆ హడావుడి, ఆ ఆనందం - ఆ 8 సింహాల్లోనూ తెలుస్తోంది. తిన్నవి తింటూ, ఎండలో నీడని వెతుక్కుంటూ వాన్‌ల కిందకి చేరారు. మాకు మాత్రం కాల చక్రం నిలిచిపోయింది. అవి కదిలితేనే మా ప్రయాణం. అంతవరకు మా వాన్ కదిలే ప్రసక్తి లేదు. ఆశ్చర్యమేమిటంటే డ్రైవర్ జోసెఫ్ మాత్రం ఏమీ చలించకుండా కూర్చున్నాడు. తర్వాత చెప్పాడు - అతని పదిహేను సంవత్సరాల సర్వీసులో ఇన్ని సింహాలు ఇంత ముమ్మరంగా వచ్చి కూర్చోడం ఎన్నడూ జరగలేదట. ఉన్నట్టుండి సింహాలన్నీ ఒక్క ఉదుటున లేచాయి. మాకు ఆశ్చర్యం కలిగింది. అన్నీ ఒక్కసారి ఎందుకు లేచాయి? అని. సెవన్నా రెల్లు వేపు పరుగులు తీశాయి. ఏముంది? జోసెఫ్ చెప్పిన సమాధానం మమ్మల్ని నిర్ఘాంతపోయేటట్టు చేసింది.

"వెనక మసాయి మనిషి వస్తున్నాడు. అందుకని పారిపోతున్నాయి" అన్నాడు. పిల్లలకి తలిదండ్రులు చేసిన హెచ్చరికేమో! "మసాయి ఒక్కడే మనల్ని వేటాడే మొనగాడు. వాడి జోలికి పోవద్దు" అని.

వెనక్కి చూశాం. దాదాపు 200 ఆవుల్ని తోలుకుంటూ మసాయ్ నిర్లక్ష్యంగా నడుచుకు వస్తున్నాడు.

మమ్మల్ని వాన్ దిగితే ప్రమాదమన్నారు. కానీ ఈ మసాయ్ నిర్భయంగా ఆవుల్ని తోలుకుంటూ సింహాల సమక్షంలో తిరుగుతున్నాడు! మసాయ్‌ని చూసి సింహాలు బెదురుతాయనడానికి ఈ సంఘటన సాక్ష్యం.

ఇక ఆ తర్వాత చూసిన వేలాది లేళ్ళూ, అడివి దున్నలూ, చారల గుర్రాలూ, ఏనుగులూ - మా ఉదయపు అనుభవాన్ని జయించలేకపోయాయి. అయితే అన్ని వేల జంతువుల్ని ఒక్కసరి చూడడం ఒక అనుభవం. సామూహికంగా గడపడం వాటి బలం.

అవసరమయితే అన్నీ కలిసి క్రూరజంతువుని ఎదిరిస్తాయి. అయితే ఎదిరించే ప్రమాదాన్ని ముందే గ్రహించి ఆ జంతువు వీటి జోలికి రాదు. ఆహారం దాని అవసరం, ఆత్మ రక్షణ వీటి అవసరం.

సాయంకాలం గొరొంగోరో కొండల చాటున సూర్యుడు అస్తమించే వేళకి - అద్భుతమయిన అనుభవాల మూటలు భుజాన వేసుకుని - మన్యారా ఫిగ్ లాడ్జి చేరుకున్నాం.

మన్యారా నుంచీ అరూషా చేరే దారిలో ఓ పది మీటర్లు పక్క దారిని వెళితే తరంగిరె నేషనల్ పార్క్ వస్తుంది.

ఇంతవరకు శివంగుల్ని చూశాం, సింహం పిల్లల్ని చూశాం. కానీ జూలు విదుల్చుకుని నిలిచే మృగరాజు ఎక్కడ? ఈ మధ్య సింహాలూ క్షవరశాలలకి వెళుతున్నాయేమోనని జోక్ చేశారు ప్రసాదరావుగారు. ఏమయినా అది తీరని కోరిక. సెరెంగిటి, గొరొంగోరో దాటాక ఇక చూడగలమన్న ఆశ సన్నగిల్లిపోయింది. ఈ పార్కుల్లో మిగతా జీవరాసులు సమృద్ధిగా ఉన్నాయి కానీ - మృగరాజు!



తరంగిరెలో అన్ని జంతువులూ ఉన్నా సాంద్రత తక్కువ. వేసవిలో మిగతా పార్కుల్లో నీరు తగ్గినప్పుడు చాలా జంతువులు ఇక్కడికి చేరతాయి. ఈ పార్కులో ఉన్న తరంగిరె నది ఎప్పుడూ ఎండిపోదు. పక్షులు - హార్న్‌బిల్, ఫ్లెమింగో, కింగ్ ఫిషర్, ఎరుపు రంగు చిలకలు - అన్నీ కనిపించాయి. ఇక్కడ తరుచు కనిపించే సెక్రెటరీ పక్షి కనిపించలేదు. అక్కడక్కడా ఉష్ట్రపక్షులు కనిపించాయి. ఆస్ట్రేలియాలో ఎమూ లాగా ఎగరలేని పక్షి ఉష్ట్రపక్షి. కానీ దాని పరుగును చాలా జంతువులు అందులోలేవు. పార్కులో మబ్బు పట్టి ఉంది. దృశ్యాలూ 'మబ్బు'గానే ఉన్నాయి. ఎన్ని చూస్తే ఏం లాభం? అనుకుంటూ ముందుకు సాగుతున్నాం. ఉన్నట్టుండి "లయన్స్!" అని గేరు మార్చాడు జోసెఫ్, అంతా తుళ్ళిపడ్డాం. మా వాన్ నీడలో చిన్న చెట్టు చాటున మృగరాజు! ఏమీ అనుమానం లేదు. క్రాపింగు చేయించుకోలేదు. పక్కనే వెల్లకిలా పడుకున్న అతి సౌందర్య రాశి - శివంగి. ఒక్క సింహం, శివంగులలోనే ఆ సౌందర్యం, ఆ గాంభీర్యం, ఆ regal dignity ని చూస్తాం. ఈ చల్లబాటు వేళ ఆ రెండూ సంగమిస్తున్న సమయమది. సింహం 300 సార్లు రమిస్తుందట. మా వాన్‌ని పదిగజాల దూరంలో ఆపాడు జోసెఫ్. ఈసారి ప్రసాదురావుగారి భార్య - మీనా గారి కాళ్ళు చల్లబడ్డాయి. మా ఆవిడ నవ్వుతోంది. శివకామ సుందరి సింహ వాహిని కదా? ఆమెకి భయమేమిటి? అంటారు ప్రసాదరావుగారు. ఇవన్నీ తర్వత మాట్లాడుకునే మాటలు. ఎదురుగ్గా lethal brute force. మమ్మల్నే గుర్రుగా చూస్తోంది సింహం. ఎట్టి పరిస్థితుల్లోనూ మేమక్కడ ఉండటం సింహానికి నచ్చలేదు. ఆ నచ్చకపోవడం మావేపు పళ్ళు బయట పెట్టి గాండ్రించడంలో (sneer) తెలుస్తోంది. దాని గాంభీర్యం, అందం, రాజసం, అలాంటి సమయంలో దాని పౌరుషం, విసుగుదలా - అన్నీ ద్యోతకమయాయి. శివంగి మాత్రం మత్తులో ఉంది. మా మీద ధ్యాస లేదు. ఓ క్షణంలో గర్జిస్తూ మా మీదకి దూసుకు వచ్చింది సింహం. ఆ క్షణంలో అందరికీ కాళ్ళూ, చేతులూ చల్లబడిపోయాయి. ఆ దూసుకు వచ్చిన వేగంలో కేవలం 5 గజాల దూరంలో ఆగింది. వాన్‌ని ఎదిరించడం అసాధ్యమని దానికి అనుభవం నేర్పిన పాఠమేమో. వేటాడి ఆహారం సంపాదించుకునే జంతువులు ఏ చిన్న కీడుని శంకించినా ఆ ప్రయత్నం చెయ్యవు.. భర్తృహరి మాటల్లో కేసరి జీర్ణతృణం మేయదు కానీ, లేడిపిల్లని వేటాడే ధైర్యమూ, శక్తీ సింహానికి పోతుంది. అప్పుడు ఇక సింహం వేటాడ గలిగే ప్రాణి ఒక్కటే ఉంది - మనిషి. అప్పుడే క్రూరజంతువులు మనుషుల్ని మరుగుతాయి. ఊళ్ళ మీద పడి గుంజలకి కట్టిన ఆవుల్ని, మేకల్ని కబళిస్తాయి.

ఏమయినా అంత దగ్గర్లో మృగరాజునీ, భార్యనీ - వాటి సంగమాన్నీ గమనించడం అరుదైన సంఘటన. రెండూ orgasm వచ్చినప్పుడు గర్జిస్తాయి. అంతా క్షణకాలం. మరో ప్రాణికి అంకురార్పణ. ఈ సంఘటన తర్వాత సెవన్నా రెల్లు మధ్య ఒత్తిగిల్లింది భార్య. చెట్టునీడకి తరలి పోయాడు మహారాజు. ఇక ఇద్దరూ మమ్మల్ని పట్టించుకోలేదు. అంత దగ్గర్లో ఇద్దర్నీ గమనించడం తనివితీరని అనుభూతి. ఈ యాత్రకిది పరాకాష్ఠ. ఆ తర్వాత ఏంచేసినా చూడకపోయినా పరవాలేదు. అక్కడితో మా యాత్ర పూర్తయినట్టే. 'పూర్త'వడం సరయిన పదం కాదనిపిస్తుంది. హిందీలో మంచి మాట ఉంది - సంపన్నమయింది అని. అక్కడితో మా యాత్ర సంపన్నమయింది.

అరూషా పట్టణానికి దాదాపు ఆనుకుని ఉన్న పార్కు అరూషా నేషనల్ పార్కు పేరుని సార్థకం చేసే పార్కు ఇది ఒక్కటే. అసలయిన వన్యప్రాంతం. కిలిమంజారో, మేరు (మనదేశపు మేరు పర్వతం కాదు) పర్వత శ్రేణుల మధ్య ఉన్న పార్కు ఇది. 53 మైళ్ళ విస్తీర్ణం. ఇక్కడ ఉన్నన్ని నీటి సరస్సులు మరెక్కడా లేవు. ఇక్కడ ఉన్నన్ని అగ్ని పర్వతపు అవశేషాలూ మరెక్కడా లేవు. ఇక్కడున్నంత వృక్షసంపద మరెక్కడా లేదు. అడవి దున్న, జిరాఫీ - ఇక్కడ విరివిగా కనిపిస్తాయి. కొలోబస్ అనే విచిత్రమయిన కోతి ఇక్కడ మాత్రమే కనిపిస్తుంది. తెలుపు, నలుపు కలబోతలాగ ఉంటాయి ఈ కోతులు. తోక తెల్లటి కుచ్చు. ఎప్పుడూ కొమ్మల మీదే ఉంటాయి. వాటి ఆహారం కూడా అక్కడే తోకల్ని కిందకి వేలాడేసి, కబుర్లు చెప్పుకునే ముత్తయిదువల్లాగ చెట్ల మీదే సభ తీరుస్తాయి - కోతి లక్షణాలు కాస్త కొరవడ్డ తెల్లకోతులివి. ఈ పార్కుకి సింహం, చిరుతపులి తెలీదు. ఇక్కడి జంతువులు జీవితంలో వాటిని చూసి ఉండవేమో.

ఈ ప్రాంతంలో ఒకప్పుడు అగ్నిపర్వతాలు ఎక్కువగా ఉండవేమో. గురుదోతో, మేరు అగ్ని పర్వతాల గోతులు (క్రేటర్లు) ఇక్కడ కనిపిస్తాయి. గురుదోతో దాదాపు పది మైళ్ళు వ్యాసం ఉన్న పళ్ళెం (కల్డెరా) - గొరొంగోరోలాగే. ఇదీ ఒకప్పుడు కూలిపోయి పళ్ళెంగా మిగిలిపోయింది. అయితే గొరొంగోరో లాగా దీనిలోకి మార్గాన్ని వీరు చెయ్యలేదు. లక్షల సంవత్సరాలలో ఇక్కడా జంతువులు పుట్టి పెరిగాయి. చెట్లు నిలదొక్కుకున్నాయి. దూరం నుంచీ అడవి దున్నలూ, చారల గుర్రాలూ స్వేచ్ఛగా సంచరిస్తూ కనిపిస్తాయి. వీటికి మనుషులు తెలీదేమో! ఎందుకంటే ఎప్పుడూ ఎవరూ అక్కడికి వెళ్ళే ప్రయత్నం చెయ్యలేదు.



పెద్ద మెమెల్లా సరస్సులో పుష్కలంగా నీరుంది. ఒకప్పుడు ఇది అగ్నిపర్వత ప్రాంతమనడానికి ఆ నీరే సాక్ష్యం. నీటిలో గంధకం వాసన వాన్ దగ్గరికే తెలుస్తుంటుంది. గంధకపు ఛాయలు నీటి పొరల అంచుల్లో తెట్టులాగా కనిపిస్తుంటుంది. ఇక చిన్న మెమెల్లా సరస్సు సమృద్ధి అయిన మంచి నీటి సరస్సు. వాటర్ బక్, టీడ్ బక్, ఇంకా ఫ్లెమింగోలు ఇక్కడ విరివిగా కనిపిస్తాయి. అక్టోబరు నుంచీ ఏప్రిల్ వరకూ విదేశాలనుంచీ కూడా పక్షులు ఇక్కడికి తరలి వస్తాయి. ఇక్కడే ఒక హోటల్ కూడా ఉంది. ఇవి కాక ఇంకా రిషాటెక్, ట్యులీసియా, షెల్డన్ సరస్సులున్నాయి. నగరానికి దగ్గరగా ఉంది కనుక బహుశా పిక్‌నిక్‌లకీ, చిన్న చిన్న విహార యాత్రలకీ స్థానికులు ఇక్కడికి వచ్చిపోతుమాడట్యామో. ఏమయినా గొరొంగోరో, తరింగిరె పార్కులు చూసి వచ్చాక అరూషా సందర్శనం రాజుని చూసిన కళ్ళతో మొగుణ్ణి చూడడంలాంటిది!

మరొక్క సందర్భాన్ని చెప్పకపోతే ఈ యాత్రకి అన్యాయం చేసినట్టే. సెప్టెంబరు 7న భాద్రపద శుక్ల చతుర్ధి గడిచాక - విఘ్నేశ్వరుని పుట్టినరోజు జరుపుకున్నాం - ఆఫ్రికాలో. ప్రసాదరావుగారు స్వయంగా modelling clay తో వినాయకుడిని చేశారు.

మద్రాసులో మేం ప్రతిష్ఠ చేసిన లక్ష్మీగణపతి ఫొటోని తెచ్చాం. అరూషాలో ఆనాడు నలుగురం అభ్యంగన స్నానాలు చేసి అక్కడక్కడా ఏరిన ఆఫ్రికన్ మందారాలతో, అరూషా అరటి పళ్ళతో, అబూదాబీ అక్షింతలతో టాంజానియాలో తెలుగు వినాయక వ్రతకల్పానికి మా ఆవిడ పౌరోహిత్యం వహించగా పూజ చేశాం. రెడీమేడ్ పొంగల్, పెరుగన్నం భుజించి తెలుగువారనిపించుకున్నాం. విదేశాల్లో వినాయక చవితి, అరూషాలో ఆవకాయ, దార్ ఎస్ సలామ్‌లో మిరపపళ్ళ పచ్చడి రుచి అనుభవైక వేద్యమే కానీ మాటల్లో చెప్పనలవికాదు. విహార యాత్రలకీ, వినాయకుడికీ లంకె పెట్టిన పుణ్యం, పురుషార్థం సాధించిన విలక్షణమయిన యాత్రమాది.

దార్ ఎ సలామ్‌లో కూరల బజారులో మమ్మల్ని కలిసిన తెలుగు మిత్రుడు – సురేష్ కుమార్ – నేను 8,9 తేదీలలో అక్కడ ఉండబోతున్న విషయాన్ని తెలుగు మిత్రులకి చెప్పాడు. ఆ వార్త దావానలంలాగా వ్యాపించింది. అయితే కార్యకర్తలకి నా ఫోన్ నంబరు అందలేదు. మా తిరుగు ప్రయాణానికి ముందు రోజు నాతో మాట్లాడగలిగారు. అంతే. స్థానిక 'తరంగిణి' సంస్థ కార్యదర్శి శ్రీకాంత్‌గారు ఫోన్ చేశారు. నా గొంతు వింటూనే 'ఆహా! మీ గొంతు వింటూంటే ఎంత హాయిగా ఉందండీ!" అని పొంగిపోయాడు. ఉదయమే చాలామంది వచ్చారు. ఇక్కడ 300 కుటుంబాలు ఉన్నాయట. మొన్ననే వినాయక చవితి సంబరాన్ని జరుపుకున్నారు. అయినా – ఆ సాయంకాలం చాలా కుటుంబాలు సమావేశమయినాయి. కంచి పట్టు చీరలూ, తెలుగు నగలూ, భాషా – ఒక్కసారి బీచ్ కూంబరు హోటల్ ఏ విజయవాడకో, గుంటూరుకో బదిలీ అయిపోయింది. ఉపన్యాసం మన తెలివిని మరొకరి మీద రుద్దడం. సంభాషణ పరస్పరం ఆలోచనలు పంచుకోడం. రెండు గంటలసేపు కబుర్లు చెప్పుకుని మనస్సులు విప్పుకున్నాం.

మరునాడు గొట్టిపాటి శివరామకృష్ణగారు చక్కని ఆంధ్రా భోజనాన్ని తినిపించి మమ్మల్ని దార్ ఎ సలామ్ విమానాశ్రయంలో దింపారు.

తెలుగు మిత్రులు కొందరడిగారు "టాంజానియా ఎందుకు రావాలనుకున్నారు?" అని. యాత్ర ప్రారంభం కాక ముందు సరిగ్గా మా పెద్దబ్బాయి అడిగిన ప్రశ్న ఇది. అయితేఅప్పుడు విన్న విషయాలతో, ప్రసాదరావుగారి అనుభవాలతో సమాధానం చెప్పానుగానీ – తెలుగు మిత్రుల ప్రశ్నకు సాధికారంగా, స్వానుభవాన్ని జోడించి నిర్దుష్టంగా చెప్పగలిగాను.

మనిషి పురోగతిని చాలెంజర్లలో, రోదసీయానంలో, మెన్‌హాట్టన్‌లో సెక్స్ వినోదాలలో, జపాన్ బులెట్ ట్రైన్‌లలో, లైబ్రరీలలో, మేధావుల మస్తిష్కాలలో కాదు వెదకాల్సింది.

ఈ సృష్టి ఈ భూమి మీద బ్రతికే ప్రతీ ప్రాణికీ సహజంగా, ఉదారంగా, ఆయాచితంగా ఇచ్చిన సంపదని మానవ మేధస్సుతో కొల్లగొట్టి రేపటి తరాన్ని బికారుల్ని చేసే నేటితరం మానవుడు – దేవుడు ఊహించిన, ఆశించిన జీవన వైవిధ్యం (bio-diversity) ఎంత తూకంగా, ఎంత అద్భుతంగా, ఎంత హృదయంగమంగా కొనసాగుతుందో చూడాలంటే – పారిస్‌కి కాదు, న్యూయార్కుకి కాదు, లండన్‌కి కాదు, టోక్యోకి కాదు – అదృష్టవశాత్తూ మానవుడు ఇంకా చెరచడానికి పూనుకోని టాంజానియా అడవుల్లోకి అడుగు పెట్టాలి. కొన్ని లక్షల ఏళ్ళ క్రితం ఇక్కడే – అల్దుబాయ్ అనే చోట – మొదటి మానవుడు రెండు కాళ్ళతో నిలబడిన గుర్తులున్నాయి. ఇక్కడే – మానవాళి ఉన్నంత కాలం సిగ్గుతో తలదించుకోవలసిన బానిసల బజారు ఉంది. కానీ – ఇక్కడే – మానవుడు ఇంకా ఇంకా సాధ్యమయితే – చేతనయితే – సృష్టి సౌందర్యాన్ని ఎంత గొప్పగా నిలుపుకోగలడో చెప్పే జీవన వైవిధ్యం ఉంది. సృష్టికర్త తన ఔదార్యాన్ని చెప్పక చూపే సందేశం ఉంది. ఇక్కడ ఊపిరి పీల్చే ప్రతి పువ్వూ, ఆకూ, పక్షీ, లేడీ – ఏదయినా ఎప్పుడయినా – మీకు చూడగలిగే హృదయం ఉంటే – సృష్టి వైచిత్రిని హరివిల్లులాగా విప్పుతుంది. అందుకే – అందుకే – మరోసారి ఈ యాత్రని 'తీర్థయాత్ర' అంటున్నాను.

*(అయిపోయింది)*